పెద్ద కథ

"'అచీపా' చెత్తగుట్టలో పసికందు....." జిల్లా టాబ్లాయిడ్ ప్రంటు పేజీలో బాక్సు కట్టి వేశారు. డాక్టరు వినోదిని ఆశ్చర్యంగా పేపర్లోకి తొంగి చూసింది.

అప్పటికింకా పేషంట్లు ఎవరూ రాలేదు. తొమ్మిది గంటలే అయింది. వినోదిని వుండేది హాస్పటల్ పైనే. పేపరు చూస్తుండగానే అపర్ణ వచ్చింది.చేతిలో పేపరు అపర్ణకిచ్చింది చూడమన్నట్లుగా.

అపర్ణ యం.బి.బి.యస్ అయిపోయి పి.జి.కి ప్రిపేర్ అవుతోంది. వినోదిని ఆ మధ్య ఫ్రెండ్స్‌తో సింగపూర్ పాకేజ్‌టూర్‌లో వెళుతూ తెలిసిన వాళ్ళమ్మాయిగదాని! అపర్ణను తను వచ్చేదాకా హాస్పటల్‌లో కూర్చోమంది. ఆ అలవాటుతో, ఎక్స్‌పీరియన్స్‌గానూ వుంటుందని ఈ మూడు నాలుగు నెలలుగా వస్తూవుందామె! వినోదిని డబ్బు మనిషికాదని... మనుషుల పట్ల శ్రద్ధగా వుంటుందని అపర్ణకు మంచి అభిప్రాయం ఏర్పడింది. చదువుకునే రోజుల్లో విధ్యార్థిసంఘంలో వుండేదనుకుంటా. హాస్పటల్లో మాత్రం భగత్‌సింగ్ ఫోటోవుంది.

# పుట్టు కురుపు

వినోదిని చదువు అవుతూనే సూళ్ళూరుపేటలో ప్రాక్టీసు పెట్టింది. అప్పటికి ఆ ప్రాంతంలో లేడీ డాక్టరు లేకపోవడంతో కొద్దికాలం లోనే ప్రాక్టీసు స్పీడు పుంజుకుంది. ఆ రద్దీ చాలా రోజులు కొనసాగింది. తరువాత ఒకరిద్దరు లేడీ డాక్టర్లు రావడం. వాళ్ళు డి.జి.వో కూడా చేసి వుండటంతో చదువుకున్న వాళ్ళు అటుపోసాగారు. డాక్టరమ్మ హస్తవాసి మంచిదని. డబ్బు మనిషి కాదని నమ్మిన జనం ఇటు వస్తూనే వున్నారు.

అపర్ణకు ఆశ్చర్యం అదే! ఈ రోజుల్లోనూ ఇచ్చింది తీసుకుని, చెప్పిందల్లా వినే ఓ డాక్టరుండటం. వినోదిని టూర్ నుండి వచ్చాక అక్కడి సంగతులు చెప్తుంటే, ఆసక్తిగా అనిపించేదామెకు. పైగా ఆ విదేశీ టూర్‌లో మామూలుగా అందరూ తెచ్చుకునే విదేశీ వస్తువులేవీ ఆమె తెచ్చుకోకపోగా అక్కడ జరిగేవి చూడటంతో ఆమెకు సంతోషం కంటే బాధే ఎక్కువవడం అపర్ణకు మరీ వింతగా వుండేది.

పొద్దుటే పేపరు వార్త ఇద్దరినీ కలవర పరిచింది.

"నువ్వింకా చిన్నదానివి. తెలిసే అవకాశం లేదుగానీ! ఇదిగో ఇటువంటివి ఇరవై పాతికేళ్ళక్రితం మేం వినడం చాలా అరుదు. ప్రాక్టీసు పెట్టి పదిహేనేళ్లపై మాటే. అందులో అప్పుడు నేనొక్కదాన్నే ఈ ఊళ్ళో. అయినా అబార్షన్ కేసులు చేసింది వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. అసలు డెలివరీకే హాస్పటల్‌కి రావటం చాలా తక్కువ, ఇప్పుడిప్పుడు అలవాటు పడుతున్నారుగానీ!"

..."అయినా ఎంతవూరనీ! ఆ బారు కాళహస్తి రోడ్డు. ఆ పక్క చిన్న చిన్న సందుల్లాంటి బజార్లు. అటు రైల్వేస్టేషన్. బస్సులు కూడా ఆ గడియారం స్థంభం దగ్గర ఆగేవి. ఒక్క గవర్నమెంటు హైస్కూలు ఈ కాన్వెంటు లెక్కడున్నయ్యా! ఇదిగో ఈ పదీ పదిహేను ఏళ్ళల్లో కాన్వెంట్లూ, హాస్పటల్సూ, ఆటోలూ! ఊరు పెరిగిపోయింది. మరీ ఈ నాలుగేళ్ళల్లో బైపాసురోడ్డు వచ్చాక మరీనూ!"

"ఒక్కోసారి అనిపిస్తుంది అపర్ణా! మనం కిందికి పోతున్నామా మీదికి పోతున్నామా అని! డెవలప్‌మెంట్ అంటున్నారు. పరిశ్రమలంటున్నారు. వారి కోసం ఈ రోడ్లు తవ్వి నాలుగులైన్ల రోడ్లు వేశారు. ఈ రోడ్లమీద ఏ జనంనడుస్తున్నారూ!... అంతా కంటైనర్లూ, పద్దెనిమిది టైర్లు, ఇరవై టైర్ల పెద్ద పెద్ద బండ్లు దయ్యాలల్లే. ఈ భారీ వాహనాల్లో ఏమిటి? ఎక్కడికి? ఎవరికోసం చేరవేస్తున్నారో! నాకు అర్థమేకాదు".

"ఆ రోడ్డుమీదకు పోవాలంటే ఆ దుమ్ముతో ఎట్లానోనని ఒకటే భయం. అసలు రోడ్డు దాటిపోయి తిరిగిరాగలమా! అన్నది ఎంత సందేహమూ ఆ లారీ స్పీడు చూస్తుంటే. ఇంతింత రోడ్లు వేశారా? అయినా యాక్సిడెంట్లు ఇప్పుడు ఇంకా ఎక్కువయ్యాయి. ఈ అదుపులేని ఆపలేని వేగం వల్ల".

అపర్ణ ఆసక్తిగా ఆమె మొహంలోకి చూస్తోంది. ఏమిటో! ఈ చివరనుండి ఆ చివరిదాకా నెల్లూరునుండి మద్రాసు దాకా ఇండస్ట్రియల్ కారిడార్ చేస్తారంట. నిజంగా అదే జరిగితే ఈ ప్రాంతమంతా మనుషులు వుండడానికి వుంటుందో! వుండదో! మరి! అందరం ఎటన్నా వలస పోవాలేమో? సాలోచనగా తనలో తానే అనుకున్నట్టుగా పైకే అన్నది. ఏవేవో అంతులేని ఆలోచన చుట్టుముట్టగా మౌనంగా వుండిపోయింది.

వినోదిని మొహం ఎలాగో అయిపోయింది. పేపరు చూస్తుండిపోయింది.

నిశ్శబ్దంగా మారిన ఆ వాతావరణంనుండి అపర్ణ గొంతు విప్పింది... "ఏంటి మేడమ్! పొద్దుటే విచారంలో మునిగిపోయారు. ఇది సహజమే గదండీ! కాలంలో మార్పులు అనివార్యం గదా! అప్పుడు లక్షల్లో వున్న జనం ఇప్పుడు కోట్లలోకి పోయారు. అవసరాలు పెరిగాయి. దాని కనుగుణంగా సమాజం తనను తాను మార్చుకుంటూ పోవాల్సిందే గదా! లేకపోతే లోకం నడుస్తుందా మేడం"

"నువ్వన్నది నిజమేగాని అపర్ణా! ఈ మార్పులన్నీ జనానికి ఉపయోగపడుతున్నాయా? నన్నదే నా సంశయం"... ఇంతగా పరిశ్రమలు పెట్టబోతున్నారు. మరి రేపటిరోజు నిరుద్యోగం, దారిద్ర్యం లేని సమాజం వస్తుందంటావా?

"సమస్యలు, తారతమ్యాలు ఎప్పుడూ వుండేవే మేడం!... అదంతే ! అయితే మార్పు వస్తుంది. మన అమ్మమ్మల నాడున్నట్టు మనమున్నామా? రేపు మనపిల్లలుంటారా! మేడమ్!... అంతదాకా ఎందుకు మీరు చదివినప్పటికీ ఇప్పటికీ మన వైద్యశాస్త్రంలోనే ఎన్ని మార్పులు రాలేదూ?... ఎంతస్పెషలైజేషన్ వచ్చిందీ?... ఎంత సైన్స్ పెరిగింది... గుండెతీసి గుండె అమరుస్తున్నారు.

సశేషం

(మిగతాభాగం వచ్చే నెల సంచికలో)

**నల్లూరి రుక్మిణి**

Printed, Published, Edited and Owned by Nanduri RajaGopala Rao V.V.S. and Printed at VANAJA OFFSET PRINTERS # 32-21-18A, Seetaramapuram, VIJAYAWADA - 4. Published at CHINUKU Sahitya Masa Patrika 27,28,IIIrd Floor, Datta's Nayabazar, Opp. Raj Yuvaraj Theatres, Gandhinagar, VIJAYAWADA - 3. Editor NANDURI RAJA GOPALA RAO. V.V.S.

# పుట్టు కురుపు

నల్లూరి రుక్మిణి

సరిగ్గా అదే నేను చెప్పేది అపర్ణా! మారుతోంది. మారాలి కూడా!... కానీ ఆ మారింది ఎవరికి ఉపయోగపడుతోంది! ఎవరికి నష్టం కలిగిస్తోంది? అదిగదా! అసలు సంగతి. అదిగదా మనం విచారం చెయ్యవలసిందీ?... గుండె మార్పిడి చ్చింది నిజమే ఏ పేదలు చేయించుకో లుగుతున్నారూ? ఆ పేదలే వైరల్ జ్వరాలతోనే చచ్చి తున్నారే? కిడ్నీలు మార్పించుకోగల్గింది ఎవరు? ప్పులకోసం కిడ్నీలు అమ్ముకునే దారిద్ర్యం ఇంకా ండబట్టేగదా!"... ఈ స్పెషలైజేషన్... అభివృద్ధి వరికోసం?

అపర్ణ ఏం మాట్లాడలేదు. సంభాషణ గిపోయింది.

పది గంటలయ్యింది. ఆయమ్మలు చిమ్మడం, డవడం అయి సర్దుతున్నారు. పేషంట్లు వచ్చే మయం. ఇంతలో పైకి పోయి 'టీ' తాగి ద్దామంటా వినోదిని పైకి దారితీసింది.

అపర్ణ సోఫాలో కూర్చుని పరిశీలనగా డసాగింది. ఇంట్లో పెద్ద ఖరీదైన వస్తువులేమీ వు. అంతగా అలంకరణాలేదు. సామాన్యంగా ంది "టౌన్లో వుండే డాక్టర్ ఇళ్లకూ... ఇట్లా చిన్న న్న 'ఊళ్లల్లో వుండే వాళ్ళకు ఏం తేడా!" అనుకుంది.

'టీ' తాగి కిందికి వచ్చేటప్పటికి ఇద్దరు గ్గురు పేషంట్లు వచ్చున్నారు. ఒకామె గర్భిణీ... పిల్ల తల్లి మరొకామె. మూడో స్త్రీ జ్వరం ఏమో! ణగదీసుకుని కూర్చోనుంది.

పేషంట్లు తక్కువగానే వుండటం వల్ల నంగా వాళ్ళు చెప్పినవన్నీ విని, మందులు చ్చింది. వాళ్ళు బల్లమీద డబ్బులు పెడితే ఎంతో డా చూసుకోకుండా..." సరేలే! జాగ్రత్తగా దులు వాడండి" అని చెప్పింది.

అపర్ణ అంతక్రితం మధ్యలో ఆపేసిన సంభాషణ పొడిగిస్తూ" ఏంటి మేడమ్ "అన్ వాంటెడ్-72" అనగానే అట్లా చూశారూ! అంది.

వినోదిని నవ్వింది. "గ్రహించావన్నమాట! అట్లా ఎవరన్నా తెలియని వాళ్లు మాట్లాడితే, సరే! డాక్టరువై వుండీ అలా అంటే ఏమనుకోవాలీ. ఈ 'అన్‌వాంటెడ్-72' ఇది వచ్చాక రెగ్యులర్ 'ఓవరాల్' పడిపోయింది, ఇదేమో చాలా పవర్‌ఫుల్. దీనివల్ల స్త్రీల శరీరాలు మరింత ధ్వంసం కావడం లేదూ? అని ఇప్పుడు ఇది ఎవరు కొంటున్నారో- ఆ డేటా కాస్త గమనించు! పెళ్లికాని పిల్లలు!... సేఫ్ డ్రస్ ఎటు డ్రైవ్ చేస్తోందో చూడు!...." ఇది మనకే అవగాహన లేకపోతే... సామాన్య జనం ఏం అర్థం చేసుకుంటారూ?" దీన్ని మెడికల్ అభివృద్ధి అనవచ్చునా!"... మెత్తగా మందలింపుగా అన్నది.

అపర్ణ మౌనంగా వుండిపోయింది.

వీళ్ళు మాట్లాడుకుంటుండగానే హాస్పటల్ ముందు ఆగిన ఆటోలో నుండి పదహారూ, పదిహేడేళ్ల పిల్లను పట్టుకుని బలవంతంగా నడిపించుకుని వచ్చిందో నడీడు ఆమె. వాళ్ళతో మరెవరూ లేరు. ఆ ఆడమనిషిని చూస్తుంటే జుట్టురేగిపోయి, కళ్లు లోపలికి పోయి సగం కుంగిపోయినట్టుగా వుంటుంది.

వినోదిని వాళ్ళను చూస్తూనే నర్సును కేకేసి ఆ పిల్లను పట్టుకుని తీసుకు రమ్మంది!.... లోపలికి తెచ్చి బల్లమీద పడుకోబెట్టారు.

వచ్చిన వాళ్ళు స్థిమితపడ్డాక-తల్లిని వివరాలు అడిగింది. "పిల్లకు కడుపులో నొప్పి ఎక్కువై రాత్రంతా నిదరలేదమ్మా! మెలికలు తిరిగిపోయింది. తెల్లారిందాకా గండం గడుచుద్దా! లేదా!ని దండం బెట్టుకున్నానమ్మా!"... కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా చెప్పిందామె.

వినోదిని లేచి బల్లదగ్గరకు పోయింది. ఆ పిల్ల ఈ లోకంలో లేనట్లు కళ్లు తేలేసి పడుకోనుంది. డాక్టరుకు ఇటువంటి కేసులు అనుభవంలో వున్నవే!

ఆ పిల్ల పేరు అడుగుతూ! కడుపుమీద చెయ్యి వెయ్యగానే వులిక్కిపడింది. పొట్టంతా కమిలినట్టుగా వుంది.

వినోదిని తిరిగి వచ్చి... కూర్చుంటూ- "నీ పేరేమిటో గానీ!... డాక్టరు దగ్గరకు వచ్చి నిజాలు దాస్తే మీకే నష్టం. సరైన వైద్యం చెయ్యాలంటే జరిగింది చెప్పాలి" అంది.

అప్పటికే ఆమె మొహం కందగడ్డయింది.

"ఇంతకీ మీది తొండూరా? మాంబట్టా?" అడిగింది డాక్టరు..." అచీపాలో పనికి పోతుందా?.... మళ్ళీ ప్రశ్న వేసింది.

అపర్ణకు ఆశ్చర్యమేసింది. తెలిసినట్టుగా అడుగుతుంటే!

"మాది 'మాంబట్టే' నమ్మా!... ఆ కంపెనీకి పోయినాకనే నమ్మా ఈ తిప్పలు" అందామె.

'నెలసరి రాక ఎన్నాళ్ళయ్యిందీ'!... డాక్టర్ అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పలేక కళ్లు కిందికి దించి మౌనంగా ఉండిపోయింది.

"మీరు చెప్పకపోయినా! వేం తెలుసకుంటాంగదా! దాచి ప్రయోజనమేముందీ?"... ఇంతకూ సొంత వైద్యం ఏం చేశావూ?... పిల్ల ప్రాణంమీదికి"... మందలింపుగా అడిగింది.

ఆమె నోరెళ్ళబెట్టి భయం భయంగా చూడసాగింది. ఆమెకి రాత్రి జరిగింది అప్పుడే జరుగుతున్నట్టుగా ఉంది.

జయ, అర్ధరాత్రి కాడ కడుపులో నొప్పని మెలికలు తిరిగిపోవడం కళ్ళల్లో మెదిలింది. అప్పటికి కూతురికి నెలసరి రాక రెండోనెల. వనమ్మకు అనుమానం కలిగింది. కూతురు పోకిళ్ళు చూస్తూనే ఉంది. తండ్రి లేకపోవడంతో తల్లి పెద్ద లెక్కజేసినట్టుండదు. జయ మొగపిల్లలతో, తిరుగుతుందని పరోక్షంగా ఆమెకు పల్లెలోవాళ్లు హెచ్చరికలు చేశారు కూడా.

జయ మొదటినెల తల్లికి తెలియకుండా మేనేజ్‌చేసి కానీ రెండోనెల నిండేసరికి కూతురి మొహంలోనూ తిండిలోనూ మార్పు కనబడింది తల్లికి. దానితో ఆమె గట్టిగా నిలదీయగా జయ

తప్పించుకో లేకపోయింది. తీరా బయటపడ్డాక జయ ఏడవటం మొదలుపెట్టింది. తల్లికి కాలూ చెయ్యీ ఆడలేదు. పేటకు పోయి తీసేయించుకుని రావాలంటే నలుగురికీ తెలుస్తుందేమోనన్న భయం.

ఎటూ తేలక! ముందు తనకు తెలిసిన... నాటు వైద్యం మొదలుపెట్టింది వనమ్మ. అది పని చేయక వికటించినట్టయి జయ రాత్రంతా కడుపునొప్పితో అల్లాడిపోసాగింది. దానితో ఆమెకు దడ ఎక్కువై, ఏం చెయ్యాలో పాలుపోక పక్కనున్న మార్తమ్మను చుట్టుప్రక్కలవాళ్ళకు చప్పుడుకాకుండా పిలుచుకువచ్చింది.

ఇద్దరూ కలిసి ఆ అర్ధరాత్రి కాడ ఏవేవో చేశారు. వేడినీళ్లు కాచి తాగించారు. వాము, మిరపగింజలు నలిపి నమిలించారు. కొబ్బరినూనె పొట్టమీద పోసి మెల్లిగా మర్దన చేశారు. ఎన్నిచేసినా తగ్గిందికాదు. అయినా ఏదో ఒకటి తోచింది చేస్తూనే వున్నారు. చివరికి నొప్పితో అలసిపోయి మగతలోకి జారుకుంది జయ. అప్పటికి వనమ్మ కుదుటపడింది.

తెల్లారుతూనే రెండోకంటికి తెలియకుండా ఇక్కడికి తీసుకువచ్చింది. పల్లెలో తెలియకుండా చెయ్యాలనుకుందిగానీ... ఆమెవల్ల కాలేదు. పొద్దున్నే ఆటోలో తీసుకురావడం కొందరు చూడనే చూశారు. కూతురు కిట్లా అయిందనే కంటే రేపటి నుండి లోకానికి ఏం చెప్పాలన్నదే మరింత దిగులామెకు. చనిపోయిన భర్తను తలుచుకొని మరోసారి ఏడ్చుకుంది.

ఆమె ధోరణిలో ఆమె వుండగా డాక్టరమ్మ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

"ఇంతకీ ఏం చేశావో! చెప్పకపోతివి"... మరోసారి అడిగింది.

వనమ్మ మౌనంగా వుండిపోయింది.

దానితో రెట్టించి బాధ పెట్టడమెందుకనుకుంది! వినోదిని. ఆ మాట పొడిగించకండా!... "ఇదిగో ఈ పూట ముందు ఆ పిల్ల తేరుకుంటే తరువాత సంగతి చూద్దాం..." అని, నర్సుని పిలిచి పేషంటును రూంలో చేర్చమని ఏం చెయ్యాలో వివరాలు చెప్పి... మందులు రాసింది.

× × ×

ఉదయం పూటే హాస్పటల్లో హడావుడి ఎక్కువ. ఏదైనా అవసరమయిన కేసు అయితే తప్ప సాయంకాలాలు పెద్దగా పని వుండదు. పైగా సంపాదన మీద ధ్యాస తక్కువ కావడంతో వచ్చినంత వరకు తృప్తిగానే వుంటుంది వినోదిని.

అయితే అపర్ణ రసాగాక ఆరుదాటాక రోజూ కాసేపు వచ్చి కూర్చోవడం అలవాటయ్యింది. ఇద్దరికీ వయసులో తేడా వున్నా... వినోదిని కున్న చొరవ, ఉత్సాహం ఆ తేడాను గుర్తు పెట్టుకునేటట్టుగా చెయ్యదు. తన పెద్దరికాన్ని ప్రదర్శించకుండా... అనుభవాలు చెప్తూ! ఈ తరం ఆలోచనలు పంచుకున్నట్లుండే వినోదిని అంటే అపర్ణకు ఆసక్తి ఏర్పడింది.

జయ దగ్గరకు పోయి చూశారు. సెలైన్ బాటిల్ అయిపోయింది. వచ్చినప్పటికంటే చాలా తేరుకుంది. 'అన్నం పెట్టావా!' అని తల్లిని అడిగారు.

తిరిగి రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాక అపర్ణకు ఆ కేసు విషయం చెప్తూ... "పొద్దుట నేనట్లా గట్టిగా మాట్లాడ్డం నీకు ఇబ్బందిగా అనిపించినట్లుంది" అంది వినోదిని.

"ఈ మధ్యకాలంలో ఇలాంటివి ఆ ఊళ్ళనుండి ఎన్ని కేసులో! అందరూ ఈ టీనేజ్ పిల్లలే!"... "పొద్దుట వార్త చదివావుగా, ఈ కేసూ చూశావు! రెండూ ఆ ఊళ్ళ నుండే... ఏమనిపిస్తుంది? ఏదైనా ఆలోచన వచ్చిందా?"

అపర్ణ ఏం మాట్లాడలేదు.

చీకటి తన చెరగును మెల్లగా లోకం మీదకు కప్పసాగింది. వెలుగు తెర తప్పుకుంటూ వుంది. లోకం విశ్రాంతి తీసుకునే సమయం.

రూమ్‌లో ఫ్యాన్ టిక్కు టిక్కు మోత చేస్తోంది.

డాక్టరమ్మల్దిరూ వనిలేనట్టు మాటల్లోపడేటప్పటికి... నర్సు కూడా పోయి వరండాలో బెంచిమీద కూర్చుంది.

"పొద్దుట అనుకున్నావే అభివృద్ధీ!... ముందుకు పోవడం గురించి ఇదిగో దాని ఫలితాల్లో ఇదొకటీ!!

ఓ క్షణం ఆలోచనల్లో పడింది అపర్ణ... "నిజమేగానీ మేడమ్! ఇల్లీగల్ సంబంధాలు కొత్తకాదుగా! ఎప్పుడూ వున్నవే గదా!"


"అవును! కాలంలో అవో అనివార్యపు వాస్తవం. కానీ ఎక్కడో నూటికో, కోటికో...! ఇప్పుడలా కాదు..." "పైగా ఇప్పుడివన్నీ మనుషుల ఎమోషనల్ సారూపత్యలో నుండి వచ్చినవి కాదు. ఇదో తమాషా అయ్యింది!"... కొందరు కాలేజీ అమ్మాయిలు కూడా వాళ్ళ లగ్జరీల కోసం.. సెంట్లకని, బట్టలకని, హోటళ్ళకని ఇట్లాంటి చర్యలకు పాల్పడుతున్నారు ఏమనుకోవాలి? ఎట్లా అర్థం చేసుకోవాలి?"

అయితే వాళ్ళను, వీళ్ళతో పోల్చకూడదు. గానీ! అపర్ణా! ఈ 'అచీపా' వచ్చాక... ఈ కంపెనీలో పనిచేసే ఆడపిల్లలు ఎట్లా తయారయ్యారంటే! చెప్పలేం!. నాకు ఒక్కోసారి భయమేస్తుంది. ఒక్క కంపెనీ వస్తేనే ఇట్లా వుందే! ఇప్పుడు పెడుతున్న కంపెనీలే కాకుండా మరికొన్ని వస్తాయంటున్నారు. మద్రాసు దాకా ఈ హైవే పొడవునా ఇండస్ట్రియల్ కారిడార్ నెలకొల్పుతారట'.

అవన్నీ నిజమే అయితే చివరికి ఏ మలేషియానో, థాయ్‌లాండ్‌లాగానో 'సెక్స్' వ్యాపార కేంద్రంగా మారిపోతుందేమో ఈ తీర ప్రాంతం కూడా. చెప్తూ చెప్తూ విస్మయంగా ఆగిపోయింది వినోదిని.

ఆమె సంభాషణ అర్థాంతరంగా ఎందుక ఆపిందో అర్థంకాలేదు అపర్ణకు. వినోదిని మొహంలోకి చూసింది. ఆమె ఆలోచనలెక్కడ వున్నట్టుగా తోచింది.

కొద్దిసేపు ఆగి సంభాషణ కొనసాగిస్తూ.. "పులికాట్ దగ్గర కూడా టూరిస్ట్ సెజ్ పెడ్తున్నట్టుగా ఆ మధ్య పేపర్లో చూశాను!, ఏవో పెద్ద విదే హోటళ్ళకు శంకుస్థాపన చేశారని చదివానే"... అం అపర్ణ.




"అవును! ఆ పులికా దగ్గరకు ఇప్పుడే అందర్నీ పోనివ్వడ లేదంట. విశాలమైన సరస్సు. లోపలికంటూ బెర్తులు వేసి! బో షికార్లు పెట్టి రేపు ఈ పరిశ్రమ వుండే స్వదేశీ, విదేశీ అధికారుల శలవుదినాలలో ఎంజాయ్‌మెం కల్పించవద్దూ! "మనోళ్లు ఈ మ మలేషియా, థాయ్‌లాండ్, కౌలా పూర్ ప్యాకేజ్ టూర్లని ఎగబ పోతున్నారు! ఎందుకంటే! ఇట్లాంట చూడ్డానికే"... అన్నిరకాల భ వెధవలంతా అక్కడికి చేరి ఎంజా చేయడానికి. (సశేషం)

# పుట్టు కురుపు

అదిగో అందుకోసం ఈ అమాయకపు ఆడపిల్లలు బలైపోతున్నారు...'వినోదినికి చెప్పటం కూడా కష్టంగానే వుంది.

'నీకు ఓ సి.డి చూపిస్తా! ఓపిక ఉందా? ఆలస్యం అయితే ఫరవాలేదా?

'ఏం ప్రాబ్లమ్ లేదు మేడమ్! సి.డి చూద్దాం! ఏం సి.డి.! దేని గురించి'.

మొన్న మలేషియా టూర్‌లో 'బ్యాంకాక్' లో మాకో చిత్రమైన అనుభవం కలిగింది... అదంతా తరవాత చేప్తా' అని ... పైకి పోదాం పోదాంపద' అని

నర్సుని పిలిచి...ఎవరన్నా వస్తే పైకి వచ్చి పిలువు. ఆ పేషంటు పని రేపు చూద్దాం! ఈరోజంతా ఇంకాస్తతేరుకుంటే! రేపు డియనీ సి చెయ్యొచ్చు' అంటూ పైకి దారి తీసింది.

అపర్ణను సోఫాలో కూర్చోమని సి.డి. తియ్యడానికి సెల్ఫ్‌లోకి చూస్తూ 'ఆ దేశాల్లో 'సెక్స్' పర్మిజబుల్! తెలుసా! ఆ విపరీతం మనక్కూడా పాకి ఇక్కడా ఆ డిమాండ్ వినబడింది. ఆకాలంలో'! అని, 'పేరేమన్నా పెట్టుకోనీ... ఇది శరీరాల వ్యాపారం! పక్కా శరీరాల వ్యాపారం'. బాధను వ్యక్తం చేస్తూ అన్నది! వినోదిని.

'టూరిజం పేరుతో అక్కడ జరిగేది...స్త్రీల శరీరాల ధ్వంసం! అపర్ణా! దీని గురించిన చింత ఎవరికీ పట్టక పోవడమేమిటో? అర్థమే గావడం లేదు'

అపర్ణ ఆమె వంకే ఆశ్చర్యంగా చూస్తోంది.

సిడిని ప్లేయర్‌లో ఇన్ సర్టు చేసి స్విచ్ వేసి వినోదిని కూడ వచ్చి అపర్ణ పక్కనే సోఫాలో కూర్చుంది.

ఆమెకు 'రైనా' కళ్ళల్లో మెదిలింది.

' నువ్వు చూస్తే ఆశ్చర్యపోతావు అపర్ణా! ఈ వృత్తిలో వున్నవాళ్ళు ఎంత చిన్న వాళ్ళో తెలుసా! చదువుకునే స్తోమతులేక మధ్యలో స్కూళ్ళు మానేసిన వాళ్ళు... పేదరికంతోటి వీధుల్లోకి నెట్టబడ్డ వాళ్ళూనూ... చూస్తుంటే ఎంత ముచ్చగా వుంటారో!'

ప్లేయరు నెమ్మదిగా సాగుతోంది. రైనా మాటలు శ్రద్ధగా ఆలకించసాగింది అపర్ణ...'ఐ ట్రై నాట్ టు రేషనలైజ్ థింగ్స్... వుయ్ డు ఫర్ లివింగ్, ఐ ట్రైటు హై ఆన్ డ్రగ్స్ యాజ్ మచ్ యాజ్ ఐ కెన్! సో దట్ మై సెన్‌సెస్ స్టే నంబ్'

'నా మనసు, శరీరం మొద్దుబారేదాకాతాగితే తప్ప మాకీ బాధ తీరదు మేడమ్. ఒక్కోసారి పదిహేనూ, ఇరవైమంది దాకా కష్టమర్సు వస్తారు' చిన్నగా నవ్విన చప్పుడు.... 'ఇప్పుడునేనైతేఓల్డ్ అయిపోయానానుకోండి'. అంత బిజినెస్ దావడంలేదు' రైనా మాటలు సాగుతున్నయ్యి.

అదివింటూ ' అసలు ఈ అమ్మాయి మీ కెట్లా పరిచయమయింది! మేడమ్!' విస్మయంగా అడిగింది అపర్ణ.

అదంతా ఓ కథలే... అనుకోకుండా తటస్థపడింది ఓ ఐదు డాలర్లు ఇచ్చాం! ఆ పిల్లకు మాపట్ల సదభిప్రాయం ఏర్పడినట్లుంది. వాళ్ళు బయటివాళ్ళతో ఏమీ చెప్పరంట. అసలు మాట్లాడ రంట.కానీ ఆ రోజు ఆ పిల్ల ఎప్పటినుండో బిగపట్టి వుంచిన దుఃఖం మాముందు కుమ్మరించినట్టుగా తన జీవితాన్ని మాముందు పరచింది. అక్కడ జరిగే ఘోరాలన్నీ చెప్పుకొచ్చింది! అంది వినోదిని, రైనా కళ్ళముందు కదులుతుండగా విచారం నిండిన

నల్లూరి రుక్మిణి

గొంతుకతో చెప్పిందామె.

'దట్ గర్ల్ టోల్డ్‌మి అపర్ణా! టోల్డ్‌మి.... దట్ షి ఈజ్ హేవింగ్ హెచ్.ఐ.వి., ఎట్ సిక్స్‌టీన్ ఆఫ్ హర్ ఏజ్,షి ఈజ్ నౌ 21 ఇయర్స్'.

అంత చిన్న వయస్సులోనా! హెచ్.ఐ.వి. నా!' అపర్ణ షాకింగ్‌గా అంది.

'పైగా ఇరవై ఏళ్ళకే ఓల్డ్ ఓ వాట్ ఏ పిటియబుల్'... నాకంటే కూడా చిన్నది. ఎంత బావుందీ?'

వినోదిని చిన్నగానవ్వి... 'ఇంతకూ ఈ 'రైనా' ని ఆ కంపెనీకి అమ్మేసింది ఆ పిల్లను ప్రేమించినవాడే. ఈ పిల్లో స్కూల్ డ్రాపవుట్' అంది! విచారంగా.

మాటల్లో పడటంతో డివిడి ఆపేసింది వినోదిని.

సంభాషణ సెక్స్ వర్కర్సు మీదకు పోయింది.

అక్కడ కొందరైతే స్వయంగా భర్తలేకపోయి కష్టమర్లను తీసుకొస్తారట. వాళ్ళకది తప్పుగా అనిపించిందని ఈ 'రైనా' నే చెప్పింది. అందులో తప్పేముంది మేడమ్! ఇదీ ఒక వ్యాపారం దీనికి మా శరీరాలే పెట్టుబడి. దానికి ఎవరైతే ఏమిటి?'...ఇట్లా ఎక్కడో ఒకరైతే అదో చర్చగానీ!...., బతుకులు గడవక చాలామంది పేదవాళ్ళు ఈ పని చేస్తున్నా'రన్నది. కౌలాలంపూర్‌లో సెక్స్ వర్కర్లకంటే హౌస్‌వైఫ్స్‌కి ఎక్కువ హెచ్.ఐ.వి. వుంది తెలుసా. డేటా చూస్తే అర్థమయింది.

అపర్ణకు ఆశ్చర్యంగా వుంది పొద్దుపోయిం దని కూడా అనిపించలేదు. తెలుసుకుందామనే జిజ్ఞాసతో ఇంకా ఇంకా ప్రశ్నలు వేస్తూనే వుంది.

'రేవు ఈ బెల్టంతా వరిశ్రమలు వచ్చి...వ్యవసాయం దెబ్బతినీ, ఉద్యోగాలు లేకా! ఏమవుతుందీ? అటు అనంతపురం, కదిరివైపు పనులు పేరుతో బొంబాయి, పూనాలు పోయి ఏం చేస్తున్నారూ? వాళ్ళు చాలామంది వ్యవసాయపు కుటుంబాలకు చెందినవాళ్ళే అపర్ణా'.

ఇప్పుడు ఈ 'అచీపా'లో కూడా ఆడపిల్లల్నే ఎక్కువ తీసుకుంటున్నారు. వీళ్ళకు చదువులు తక్కువ, మిడిమిడి జ్ఞానం... లోకాన్ని జయించామన్న ధీమా వాళ్ళు చాలామంది వ్యవసాయపు కుటుంబాలకు చెందినవాళ్ళే అపర్ణా'. వాళ్ళకు జరిగే నష్టమేమిటో వాళ్ళకే తెలియదు.

ఆ మధ్య ఓ పిల్ల అబార్షన్ కోసం మందులు మింగి.... ఇదిగో ఇప్పుడొచ్చిన ఈ 'జయ' లాగే! చచ్చిపోయింది పాపం. మనమేం చెయ్యగలం.

సంభాషణ బరువుగా మారిపోయింది. బయటకు చూస్తే వీధి లైట్లలో బజారంతా వెలుతురు నిండినట్టుగా వుంది. వెలుతురు సోకని చోట చీకటి చిక్కబడ్డట్టనిపించింది.

ఇక వెల్తానన్నట్టు లేచింది అపర్ణ.

× × ×

చలికాలం కావడంతో ఆరుగంటలకే చీకటి పడిపోయింది. కూతురు కోసం చాలాసేపటినుంచి ఎదురుచూడటం వల్ల మార్తమ్మకు ఎంతో పొద్దుపోయినట్టుగా వుంది. ఆటోమోత విన్నప్పుడల్లా బయటకు వచ్చి రెండడుగులు ముందుకు వేసిరోడ్డువైపు చూపు సారిస్తోంది. కూతురు ఆ వచ్చిన ఆటోలోనన్నా వుంటుందేమోనన్న ఆశతో .దూరంగా 'అచీపా' నియోను లైట్లు, కాంతినివిరజిమ్ముతూ వరుసలు తీరివున్నాయి. ఆ వెలుతురులో 'మాంబట్టు' రోడ్డు రాత్రివేళ తారాడుతున్న నల్లని 'కోడెతాసులా మెరుస్తోంది' ఆ రోడ్డు తప్ప మిగిలినదంతా ఏమీ కనబడక ఎడారిలాగా భయపెడుతోంది.

అచీపాకో, కట్టుబడి పనికో, రోడ్డుపనికో పోయిన వాళ్ళంతా ఇళ్లకు చేరడంతో మాంబట్టు'పల్లె' సందడి సందడిగా వుంది.

భార్య ఆదుర్దాను పట్టించుకోలేదు చెంగయ్య. షన్‌షైన్ కంపెనీ పనికిపోయి వొళ్ళంతా పులిసిపోయి వున్నాడు. సిమెంటు దుమ్ము ముక్కుల్లోకి, నోట్లోకి పోయి నిస్త్రాణగా వుంటే.. కాళ్ళూ చేతులు కడుక్కోని ఓ క్షణం మంచంలో అడ్డం బడ్డాడు. ఇంతలో కన్ను మలిగింది. మార్తమ్మఆలోచనలను తెగ్గడుతూ, ఎప్పుడు తేడాడో! 'ఏమే! పిల్ల ఇంకా రాలా'! అడిగాడు.

'లే'అని వూరుకుంది అతనూ రెట్టించలేదు. రోజూ ఆవేళకు అలవాటుగా కంచాల దగ్గర చేరే పిల్లినక్కుతూ వచ్చింది. చడీ చప్పుడు లేకపోవడంతో, తానొచ్చినట్లు రెండు సార్లు మ్యావ్,మ్యావ్, అంది, అయినా ఏం ప్రయోజనం కనబడలేదు. అటూ, ఇటూ చూసి కాళ్ళు ముడతలు వేసుకు నిశ్శబ్దంగా టి.వి. పెట్టే చక్క బల్ల కిందికి చేరింది.

మార్తమ్మ వాకిట్లో మంచం మీద కూర్చోని అచీపాకు పోయిన వాళ్ళు వచ్చారో !లేదో! నన్నట్టు, చుట్టుపక్కల ఇళ్లల్లోకి చూసింది. అందరూవచ్చినట్టే కనబడ్డారు. దానితో మరింత గాబరా పుట్టింది.

చెంగయ్యకు నిద్రతేలిపోయింది. బీడీ కూడా ముట్టించకుండా ఇళ్ళసందుల్లోంచి వుత్తరం వేపు రొడ్డుమీదకు పోయాడు. చప్టా దగ్గరయితే కుర్రోళ్ళు కూర్చోనుంటారని; కొద్దిగా ముందుకు పోయాడు. అక్కడ పడున్న తూముమీద కూర్చున్నాడు. అప్పటికే టౌన్నుంచి వచ్చే ఆటోల రాకపోకలు తగ్గిపోయాయి.

అచీపా వైపు చూస్తే ఒకటీ రెండు బండ్ల లైట్లు దూరానికి కనబడుతున్నాయి. అట్లా చూస్తూవుండగానే ఓ బండి ఇటువైపు వస్తున్నట్టు గమనించాడు. ఆ వచ్చే బండి తన కూతుర్ని దింపుతుందని మనసుకు అనిపించింది. అట్లా అనిపించడంతో తూము మీదనుండి లేచి... వక్కనున్న రబ్బరు పొద చాటుచేసుకుని నిలబడ్డారు. కూతురుకి ఎదురు పడాలనిపించలేదు.

సునంద కూడా బండి దిగి బాటన రాకుండా ఇళ్ళ సందుల్లోంచి దారితీసిది. ఆమె ముందుకు పోయాక చెంగయ్య అక్కడినుండి కదిలి చప్టావైపు నాలుగడుగులు వేసి బజారుగుండా మందిరం సెంటరుకి వచ్చాడు.

అన్నాలుతిని సెంటరులో పిచ్చాపాటి వేసు కుంటున్న వాళ్ళతో రెండు మాటలు కలిపి మెల్లిగా ఇంటిదారి పట్టాడు.

కూతుర్ని చూడగానే మార్తమ్మకు దుఃఖమూ, కోపమూ కలగలిపి ముంచుకొచ్చాయి. 'అందరూవచ్చి ఎంతసేపయిందీ? ఈ అపరాత్రి దాకా ఎక్కడ తిరుగుతున్నట్టూ?" గొంతునొక్కుకుంటూ, కొపంగా అడిగింది.

సునంద తల్లివైవుఓ చూపుచూసింది సమాధానం చెప్పలేదు. మరోమాట అంటే మీదపడి పోతుందేమోనన్నట్టుగా వుంది. సునంద వాలకం.

అది నివారించడానికన్నట్టు... చెంగయ్య ఇంట్లోకి వచ్చి 'ఏమే! నీళ్ళు తోడు పొద్దుపోవడంలా! చుట్టుపక్కలోల్లు లైట్లు కూడా ఆర్పేసుకుంటున్నారు' అన్నాడు.

మౌనంగా ఎవరి వనులు వాళ్ళు ముగించుకుని మంచాలు చేరారు.

మార్తమ్మకు కునుకు పట్టలేదు. ఈ ఆడ పిల్లలిట్టా తయారయ్యారేంది? అనుకుంటూ రంధి పడుతోంది. రెండు డబ్బులు సంపాదించబట్టే ఒక్కో దానికి ఎంత పొగరెక్కింది? 'ఏమన్నా అంటే కంప కరవొచ్చినట్టు మీదపడి పోతుంది' కూతుర్ని తలచుకుంటూ తిట్టుకుంది.

"ఆ కంపెనీకి పోయే ప్రతి గాడిదా ఇట్టాగే తయారయ్యింది. ఎందుకొచ్చిన ఉద్దేగాలు, ఎందుకొచ్చిన కంపెనీలు, బతుకులో నిమ్మనం లేకపోయాక" దిగులుగా అనుకుంది.

చెంగయ్యకు ఎవరూ నిద్రపోవడం లేదని మార్తమ్మకు అర్థమవుతూ ఉంది. మార్తమ్మకు కూతురు ఎక్కడ చెడిపోతుందో అనే దిగులు. చెంగయ్యకు పిల్ల ఇలా తయారయి 'రేపటి రోజు నాది! నాయిష్టం' అంటే ! ఏం చెయ్యాల? ఓ అసహజమైన బాధేదో అతనిలో సుడి తిరుగుతోంది.


చేతిలో భూమిపోయింది.కొడుకు పోబుద్ధి పుట్టిన్నాడు కూలికిపోతున్నాడు. చిన్నపిల్లోడు చేతికంది రాకపోయే!... తనూ ఎంతకాలం ఈ పని చెయ్యగలడూ?. అసలు ఎంతకాలం ఈ పై పనులు దొరుకుతీయా?... రేపీ పిల్ల పెళ్ళి చేసుకుని పోతేనో?... ఎటూ దారి లేనట్టుగా కనబడింది.

నాలుగురోజులు ఆగి... చేద్దామన్నా ఈ పిల్ల ఆగేటట్టు లేదు అనుకున్నాడు. ఆ ఆలోచనతో చెంగయ్యకు మరింత దడ ఎక్కువయ్యినట్లయి... మంచంమీద లేచి కూర్చున్నాడు.

నష్టపరిహారం డబ్బేమో! అక్కడికక్కడ సరిపోయె!... ఏం చేసేట్టూ!... వూళ్ళో రైతులేమో భూములు మిగుల్చుకుంటిరి. అవి రేట్లు పెరిగి వాళ్ళు పెద్దోళ్ళయితిరి. ఈ వల్లెలో వాళ్ళకున్న, ఎకరా! అరెకరా!... అటు ఇందిరమ్మ ఇచ్చిన అడవినీ... అంతా మూటకట్టి ఈ కంపెనీలకి ఇస్తిరి. మా పొలాలే కావాల్సివచ్చె వాళ్ళకి.

ఊరు బాగానే వుంది. వూళ్ళో వాళ్ళూ బాగానే వున్నారు. పల్లె కొంపలే కొల్లేరులై పోతున్నాయి. ఈ మాంబట్టుని ఏ కనబడని మాయల మారో కబళిస్తోంది.

**(సశేషం)**



గత సంచిక తరువాయి

పెద్ద కథ

# పుట్టుకురుపు

## నల్లూరి రుక్మిణి

'డబ్బంటిరి... ఉద్యోగమంటిరి. డబ్బా అయిపోయింది. ఆ ఉద్యోగాలేమో ఆడపిల్లల కిస్తిరి. మొగపిల్లలకి వట్టి చేతులైపాయె! ఖాళీగా వుంది... ఆ వచ్చిన రవంత డబ్బా పేటకుపోయి ఖాళీ చేసుకొస్తుంటిరి.'

"ఈ ఆడపిల్లల్ని కంపెనీలోకి తీసుకుంటుంటే... వాళ్ళు ఏకువేకులై సంసారాలు అతలాకుతలం చేస్తుంటిరి. సునంద చిన్నప్పుడు ఎంత వొద్దిగ్గా వుండేది? తల్లి వెనకే తిరుగుతా చేతకాకున్నా తల్లి చేసే పని చెయ్యడానికి ఎట్టా చూసేది? ముచ్చటగా వుండేది. అసలిప్పుడు దానికి ఇంట్లో పనంటే ఒళ్ళు వొంగడమే లేదు!... ఇంతలో ఎంతమార్పు?"

ఆడపిల్లల్లో ఇంతమార్పు భరించేదేనా?. ఈ దూకుడు ఇతరులకేనా! వాళ్ళకి మాత్రం ప్రమాదం తెచ్చిపెట్టదూ?... ఈ 'అచీపా'లో ఆడపిల్లల తీరు... వాళ్ళమీద వింటున్న సంగతులు గుర్తుకొచ్చి ఆందోళనగా అనిపించింది.

"చూస్తుండగానే బతుకులు ఎక్కడినుండి ఎక్కడిదాకా పోయాయి? తాతా! అయ్యా!... ఇప్పుడేమో ఈ పిల్లలు... వీటన్నిటి మధ్య తానూ... తన తరం!"

పిక్కలదాకా పంచ మడిచి కట్టి బొడ్లో కత్తి దోపుకొని తిరిగే తండ్రి రూపం కళ్ళల్లో కొచ్చింది. అడవిలో తాటాకూ, ఈతాకూ తెచ్చి చీపుర్లు కట్టి... బుట్టలల్లి నెత్తిమీదేసుకుని చుట్టుపక్కల తాండూరేనా! ఎన్నమ్మ కండ్రికేనా? పులివెందలేనా! ఎన్ని వూళ్ళూ, ఎట్టా తిరిగేవాడూ! అయినా అంతగంజి... పూట ముద్ద కూడా కరువుగా వుండేది!... అప్పటికదే భాగ్యమనుకున్నాడు.

"అరే! చెంగా! అప్పుడు ఈ గంజికూడా కరువై... పైవాళ్ళతో ఏగలేకా... ఈ చిట్టడవిలో జరుగుబాటు దారిదొరక్కా!... నా అన్నదమ్ములు ఎక్కడికెక్కడికోపోయి ఎక్కడో రాలిపోయారురా!" 'ఈ తడడవి వొదలనని'!... అయ్య ఇక్కడే వుండిపోతే! అయ్యనీ, అవ్వనీ కనిపెట్టుకుని! నేనూ, నీ చిన్నబ్బా దిగబడ్డాం! అ మాంబట్టులో. "కొన్నాళ్ళుపాటు అప్పుడప్పుడు నా అన్నదమ్ములెవళో ఒకడు కనబడేది. ఇప్పుడు ఏమయ్యారో! ఏమో మళ్ళీ ఇటికేసిరాలా!... వున్నారో? లేరో కూడా తెలియదు.

"అయ్యా! చెంగా చారెడు నేల లేదురా!... అదేవుంటే ఆ మట్టికోసమన్నా! నాయన్నదమ్ములు ఎక్కడెక్కడ తిరిగినా? ఈ చోటుకి వచ్చేవారేమో!... నేల లేకపోతే బతుకుమీద తీపి ఎట్టా గుంటదిరా! నువ్వు అంతనేల సొంతానికి సంపాదించుకోరా! నీ పిల్లలు నీ రెక్కలు కాసుకోని వుంటారు". తండ్రి గొంతులో, అరనిజీర, తన వారు కనబడకుండా పోయారని దుఃఖం గుండెల్లో ఎప్పటికీ సుడులు తిరుగుతుండగా తన తండ్రి చెప్పిన జీవనసారమిది.

సారక కొట్టి... చారెడు నేలగట్టు జొన్నజల్లినపుడు అయ్యకళ్ళల్లో ఎంత సంబరమో! ఎప్పటిమాటా! తండ్రి తలపులతో చెంగయ్య కళ్ళు చెమ్మగిల్లినట్టయింది.

దానితో మంచం మీద నుండి లేచి తలాపిన పెట్టుకున్న బీడీ కట్ట తీసుకుని బజారులోకొచ్చాడు.

భార్యా, కూతురూ నిద్రలోకి జారినట్టు క్రమంగా పీలుస్తున్న శ్వాసను చూస్తూ అనుకున్నాడు.

ఊరు మాటు మణిగింది. చలికాలం కావడంతో వీధిలో మంచాలు వేసుకున్న వాళ్ళులేరు. వీధికుక్క తోకవూపుతూ వచ్చి చెంగయ్య వేపు రెండుసార్లు తిరిగి మళ్ళీ పడుకుంది.

అంత గుడిసేసుకుని... ఇల్లని, సంసారమని ఓ చోట స్థిరపడి... వూరని, వాడని ఏర్పాటాయె!... రాజులు పోయి రాజ్యాలు పోయి పేదోళ్ళకు భూములంటిరి, అడవి దున్నుకోమంటిరి.. పట్టాలిస్తామంటిరి. అదంతా ఏమైందీ?" భూములిచ్చినా మన్నోళ్ళే... వున్నది కూడా లాక్కుంటిరి.

చెంగయ్యకు గుండె పట్టేసినట్టయింది. తన ఎదుటంతా చీకటిమయంగా, కనిపించింది.

నిజంగా ఇక భూమి రానట్టేనా! ఇంకా ఏదో మాయజరిగి తనభూమి తనకు వస్తుందేమో నన్న చిన్నపాటి ఆశ రెపరెపమంటోంది.! ఎక్కడో!

నీటి వసతి లేకపోయినా వానలు వెనక బడ్డాక పదును మీద పుచ్చులు పెడితే అన్ని పైసలు కనబడేవి. గుడ్డనీ, గోచినీ పై ఖర్చులు ఎల్లబారిపోయేది.

ఇప్పుడదంతా పోయి! ఎప్పటిలాగే కూలి బతుకులే.. ఎప్పుడూ చేతులు చాచడమే... చెంగయ్య మనసు పిండినట్టయింది. భూముంటే బతుకు ఎంత నిబ్బరంగా వుంటుంది?

అయినా ఈ కూలీ, ఈ కట్టుబడీ, రోడ్డు పనులూ ఎల్లకాలం వుంటయ్యా! అయ్యి అయి పోతానే బతుకు దెరువుకోసం ఎప్పటి మాదిరిగా దేశ దిమ్మర్లుగా వలసలు పోవాలేమో! అట్టా తలపురాగా అతనికి కళ్ళు చెమ్మగిల్లాయి.

చెంగయ్య మనోనేత్రంఆకారం తెలియని తన పూర్వీకులను రూపుగట్టటానికి తహతహ లాడింది.

చీకటి మరింత చిక్కనయింది. మైదానం మీదనుండి చల్లగా ఈదురుగాలి చెవుల్లోకి కొడుతోంది. బీడీ ఆర్పి మిగిలిన ముక్కతడికెలో దోపి తొట్టి కాడికి పోయి నీళ్ళు పుక్కిలించి మంచం

ఎక్కాడు.

జరిగేదాన్ని ఆపటం ఎవరితరం. ఇక్కడ ఇదంతా ఈ పెద్ద కంపెనీలొస్తయ్యని కలగన్నారా? ఏమో. రేపు ఇవేగాక ఇంకాకొన్ని వచ్చి జనానికి బతుకుదెరువు కల్పిస్తాయేమో? అయినా ఎప్పటికీ కూలిబతుకులేగా? ఆశా నిరాశల మధ్య ఎప్పటికో నిద్రలోకిజారిపోయాడు

+ + +

అచీపా ఐదొందల ఎకరాల పెద్ద ఆవరణ.ఓమూలగా కుడివైపు తొలివిడతగా కట్టిన రెండుపెద్ద బిల్డింగులు. మిగిలిన భూమి చుట్టూ మాంబట్టుపల్లెదాకా కంచెలు వేసేశారు. ఆ భూమి ఇప్పుడు వెనకటి పంట భూమి కాదు. రోడ్డు రోలర్లతో చదును చేసి, రోడ్లు వేసి ఉద్యానవనం పెంచిన మరో లోకం. ఆ మాంబట్టు పల్లెలో వాళ్ళు కూడా చుట్టూ ఒకటిన్నర కిలోమీటర్లు తిరిగి పెద్దగేటు నుంచి డ్యూటీకి పోవాల్సిందే.

అక్కడ వయసు మీరిన వాళ్ళను పనిలో పెట్టుకోరు. అంతా కుర్రకారే. బ్లూరంగు పాంటూ, షర్టూ, మెడలో బాడ్జీలతో నీలినది ప్రవాహంలాగా గలగల్లాడుతూ గుంపులు గుంపులుగా ఆడా, మగా 'అచీపా' డ్యూటీకి వస్తున్నారు.

సునంద కూడా రాత్రి ఘర్షణ ఛాయలేమీలేని మొహంతో 'హాయి హాయి'మని తోటి వాళ్ళని పలకరించి. బాక్సు డైనింగ్ హాల్లో పెట్టి సంతకం చెయ్యడానికి ఆఫీసు వైపు పోయింది.

తలలో పూలు. రంగురంగుల క్లిప్పులు. హైహీలు చెప్పులు మనిషి కూడా తండ్రికి మల్లే ఎత్తరి. నలుపేగానీ, కంపెనీలో చేరాక వంటిమీద తీసుకున్న శ్రద్ధవల్ల నునుపుతేలి ఆకర్షణీయంగానే వుంది. దీనికితోడు ఉద్యోగం ఇచ్చినధీమా! అమాయకత్వంలోని అతిమెలపు తెలివిడితనం వ్యక్తమవుతుంది.

సునందేకాదు! అందరూ అదే వయసువారు. తుళ్ళింతలాడే దేహాలు విరిసీ విరియని మనసులు.. తొలియవ్వనపు వురుకులు పరుగులు. అంతా కోలాహలం గందరగోళం

కమల దారిలో కనబడి! "రాత్రి పొద్దుపోయిందా!" అంది

"ఆ ఇంట్లో గొడవ కూడా అయింది".

ఆఫీసులో హాజరు పడ్డాక మాట్లాడటానికి లేదు. ఆఫీసు దగ్గర నుండి వర్కు జరిగే ప్రాంతం దాకా సూపర్ వైజర్లు అడుగడుక్కీ వుంటారు.

ఇద్దరూ మౌనంగా వాళ్ళవాళ్ళయూనిట్లకు వెళ్ళిపోయారు

కంపెనీ ఆవరణలో లెదర్‌తో నిండిన కంటైనర్లు, బారులు తీరి వున్నాయి. పనివాళ్ళు అరుపులు కేకలు లేకుండా చకచకా బేళ్ళుదింపుతున్నారు.

సునందకు ఆ పూట కుట్టుమిషన్ల దగ్గర సప్లైడ్యూటీ. ట్రాలీతోమిషన్లదగ్గర కుట్టిన మెటీరియల్ ఇంకో చోటకు.. అక్కడినుండి మరో యూనిట్‌కి విరామంలేకుండా తిరుగుతూనే వుంది. మధ్య మధ్యలో శేఖర్‌కోసం కళ్ళు వెతుకుతూనే వున్నయ్యి.


రాత్రి నుండి ఆమెకు ఆరాటంగానే వుంది. ప్రతిసారీ ఆలస్యమై... నప్పుడల్లా ఏం అబద్దం చెప్పాలి? ఎన్నాళ్ళనీ! ఇంక పెద్దోళ్ళకు చెబితే పోలే... అనుకుంది! అయితే శేఖర్ ఎందుకో ఇంకా కొద్దిరోజులాగుదామంటున్నాడు అర్థం కావడం లేదామెకు.

కులాలు ఒకటి కాదు ఎలాగూ ఇళ్ళల్లో ఒప్పుకోరు.... మరి ఎన్నాళ్ళీ వూగిసలాట' సునంద ఆందోళన సునందది.

అయినా తమలాగ ఈ కంపెనీలో చేస్తున్న వాళ్ళు ఎంతమంది చేసుకోలేదూ!..

"ఇంతకీ పెళ్ళెప్పుడూ".. పక్కనున్నతను హాస్యంగా అడిగాడామెను.

"ఎక్కడా! ఇంకా ఇంట్లో చెప్పేదానికే తటపటాయిస్తుంటే" అంది కమల




శ్రీ భమిడిపాటి జగన్నాథరావుగారి మువ్వలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి పి. సత్యవతి, చిత్రంలో కథకులు, విమర్శకులు చోరగుడి జాన్సన్, కథా రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య, మువ్వలు రచయిత భమిడిపాటి జగన్నాథరావు, తదితరులు

" అదెంతలెద్దూ! చెప్పెయ్యండీ! ఒప్పుకుంటే ఒప్పుకుంటారు. లేకపోతే ఇటునుంచి ఇటు ఏ గుడిలోనో దండలు మార్చుకోవడమే! తరువాత వాళ్ళే ఒప్పుకుంటారు"

ఆ సంభాషణ వల్ల రాత్రినుండి వున్న భారమేదో తగ్గినట్టనిపించిందామెకు.

సూపర్‌వైజర్ రావడంతో ఎటు వాళ్ళటు వెళ్ళిపోయారు.

సాయంత్రం ఐదున్నరకు సునంద, కమలా బాక్సులు తీసుకుని గేటు బయటకు వచ్చేటప్పటికి శేఖర్, భాస్కర్‌లు ఎదురు చూస్తున్నారు

సునంద ఏం మాట్లాడకుండా నించుంది. శేఖర్ ఏమైందన్నట్టు చూశాడు. అయినా ఏం మాట్లాడలేదు.

కమల కల్పించుకుని "రాత్రి వాళ్ళమ్మ గొడవచేసిందట" చెప్పింది.

భాస్కర్ అందుకుని "సరేలే!పెద్దోళ్ళు అట్టాగే అంటారు" అని తేల్చాడు.

సునంద రోషంగా " నీ కేమయ్యా! అట్టాగే చెబుతావు! కమలలా నేనూ వేరే వూళ్ళో వుంటే! ఎక్కడికంటే అక్కడికి! ఏ అర్ధరాత్రిదాకానైనా వుండేదాన్ని" అంది

సరేలేమ్మా! నువ్వొకదానివేనా! సాయంత్రం డ్యూటీ అయిందంటే! మోటరు సైకిళ్ళమీద ఎన్ని జంటలు పోవడంలేదూ! ఎవరికి తెలియందీ"?

కమలా భాస్కర్‌లు అప్పటికే పెళ్ళి చేసుకునే విషయం ఇంట్లో చెప్పి వున్నారు.

గునిసి గునిసి చివరికి "ఎక్కువసేపు వుండను. రోడ్డుమీద దాకావస్తాను"! అని శేఖర్ బైక్ ఎక్కింది సునంద.

ఆ రోడ్డు వెంట చాలా జంటలు శ్రీ సిటీవైపు వెళ్ళడం చూసిన సునందకు జరిగిందంతా మరుపుకొచ్చినట్టయింది.

పైగా ఆరోజు జీతాలు పుచ్చుకోవడంతో మరింత హుషారుగా కూడా అనిపించారందరూ.

సూళ్ళూరుపేటదాకా పోదామంటే సునంద పెద్దగా అడ్డు చెప్పలేదు.

ముందురోజు ఆలస్యమయిందని కూతురుకోసం మార్తమ్మ ఎదురు చూస్తే ఆరోజు చెంగయ్య

నాలుగ్గంటల నుండీ ఎదురు చూడసాగాడు. ఆరుగంటలుదాటినా కూతురు రాలేదని కంగారుగా వుందతనికి.

కాంట్రాక్టు డబ్బు శాంక్షన్ కాలేదని పవర్‌టేక్ పని ఆపేశారు.అడపా దడపా పనులతో చెంగయ్య చేతిలో పైసా లేకుండా పోయింది అందువల్ల కూడా కూతురు రాక ఆలస్యమవడంతో ఎంతో సేపయినట్లుగా వుంది పోయినసారి జీతంలో ఐదొందలు తక్కువ తెచ్చింది, అదేంటే "నాకు వాడుకోను కావద్దా!" అంది! ఇంకా అడిగితే "నా డబ్బులు, నాయిష్టం" అంటుందేమోనని భయం.

అయినా ఈ పిల్ల మరీ బరి తెగించింది. ఏమన్నా అందామంటేఇంట్లో నుంచి పోద్దేమోనన్న భయం! అనకుండా వుందామంటే పల్లెంతా పుకారుగా వుంది. ఆడపిల్ల అదుపుతప్పి పోవడం ఎంతనామర్దాగానో వుందతనికి.

'అదే మొగపిల్లలెవరికన్నా ఈ పని వచ్చుంటే! ఇట్టా మాట్టాడితే! తన్నక పోయేవాడా!! తనలో తాను తర్కించుకుంటుంటే కోపం అంత కంతకూ పెరిగి పోతోంది.

ఈ రోజు ఏమైనా సరే! కూతురు రాగానే నాలుగు బాదాలనుకున్నాడు. చెంగయ్య ఈ ఆలోచనల్లో వుండగానే సునంద రానే వచ్చింది ఆ కోపంలో "ఎక్కడికి పోయావే! ఇప్పటిసందీ! రోజు రోజుకూ నీకత ఎక్కువవుతుందే" అన్నాడు విసురుగా,

తండ్రి మంచికోపంమీద వున్నాడనుకుంది. మరోమాట మాట్లాడేలోపు పర్సులో డబ్బులు తీసి బల్లమీద పెట్టింది. మంచినీళ్ళు తాగడానికన్నట్టు కుండ దగ్గరకుపోయింది.

నిజానికి ముందురోజు గొడవ మనసులో వుండి పెందలాడే రావాలనుకుంది. గానీ జీతాలు అందుకున్న హుషారులో సూళ్ళూరుపేట దాకా పోవడంతో మామూలుగానే అలస్య మయిపోయింది.

జీతం డబ్బులు కంటపడగానే అతనికి అరవాలనుకుందీ. అడగాలను కుందీ వెనక్కిపడి! ఈ సారైనా డబ్బులు మొత్తం ఇచ్చిందో! లేదోనన్న సంశయం ముందుకు వచ్చింది. దానితో ఆవేశం చల్లారి పోయింది. అయితే డబ్బులు మాత్రం ముట్టుకోలేదు.

ఎవరి ఆలోచనల్లో వారు డబ్బులు అట్టాగే వుంచేశారు. చివరకు మార్తమ్మే తీసి పెట్టెలో పెట్టింది.

చెంగయ్యకు కూతుర్ని కట్టుదిట్టాల్లో పెట్టడమెట్లాగో తెలియక మధన ఎక్కువయింది.

+ + +

పుష్ప మరణం మాంబట్టు పల్లెను కుదిపింది. అప్పటి వరకూ ఏవేవో వింటున్నా, చూస్తున్నా పైకి, గంభీరంగానే వున్న వల్లె దీనితో అతలా కుతలమయింది! ఈ ఆడపిల్లలేంటి? ఈ మార్పు లేందీ? ఇది మంచికేనా? ఉద్యోగాలు మానిపిస్తే? దాకా ఆలోచనలు సాగాయి.

పొద్దుటే 'అచీపా' డ్యూటీకి వెళ్ళవలసిన పుష్ప ఆత్మహత్య చేసుకుని ఇంటి దూలానికి వేలాడింది. ఇద్దరు బిడ్డల తల్లి. భర్తపోయి ఏడేళ్లు అయ్యింది. ఏం పని చేసిందీ? పల్లెనిశ్చేష్టయింది.

పుష్ప తల్లి గొల్లున ఏడుస్తోంది. నాకూతురు అన్యాయంగా పోయిందిరో! మొగుడు పోయిన్నాడు కూడా మొండి ధైర్యంగా వుందిరో! ఇన్నేళ్ళూ, ఈ బిడ్డల్ని రెక్కల కష్టంమీద పెంచుకుందిరో! ఇప్పుడెందుకీ చావు తెచ్చుకుందిరో ఈ పిల్లల్నేమి చెయ్యాలిరో! దేవుడా? నాకెందుకింత కడుపుకోత పెట్టావురా?" గుండెలు కొట్టుకుంటూ శోకాలు తీస్తోంది.

'వూరుకో! ఎందుకట్టా ఏడుస్తావు! నీ కేదన్నా అయితే ఆ బిడ్డలు అనాద పచ్చులౌతారు. దానికింతే గింజలుండయ్ భూమ్మీద ఈ పిల్లగాళ్ళ రాతబాగా లేదంతే లేకపోతే తండ్రి పోనేపోయా! తల్లి కూడా ఈ బలవంతపు చావేందీ?'

చుట్టూ చేరిన వాళ్ళలో పిల్లల మీద సాను భూతితో పాటు తల్లి ఇట్లా చేసుకోవడం మీద ఏదో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అచీపాకు పోయే ఆడ పిల్లలు పుష్ప ఇంటి పక్కనున్న నాగేంద్రం ఇంటి దగ్గర నించోని తగ్గుస్వరాలతో మాట్లాడు కుంటున్నారు.

'ఈ మధ్య వాడికి పెళ్ళి కుదిరిందట. అది తెలిసే ఈ పని చేసుకుని వుంటుంది'.

అయితే వాడు ఎల్లకాలం పెళ్ళి చేసుకోకుండా ఈమె కోసం కనిపెట్టుకు వుంటాడా? అసలు ఇద్దరు బిడ్డల తల్లిని ఎట్టా చేసుకుంటాడను కుంది? ఆలోచనవుండొద్దూ.

'ఎవరి అవసరం కోసం వాళ్ళు కలిశారు. అంతవరకే అనుకోవాలగానీ! దానికి మించి ఆశపడితే! ఇంతే మరి!"

ఈ సంభాషణతో సునందకు కాళ్ళూ, చేతులూ ఆడనట్టయింది. ఎందుకిలా జరిగిందీ? ఏదో భయం, ఆందోళన ఆ పిల్లను కుదిపాయి. ఏవేవో సందేహాలామెను చుట్టుముట్టాయి

'అచీపా' లో సంఘటన మనసులో మెదిలింది.

ఆరోజు ఫ్యాక్టరీలో గోడౌన్ ఖాళీ అయింది. ఖాళీ అయిన గోడౌన్ ఎప్పటిలాగే వూడ్చి చెత్తంతా ఎత్తి దూరంగా కుప్పలమీద పోస్తున్నారు. చెత్తను తలో దిక్కు ఎవరికి వీలయినట్టు వాళ్ళు విసిరి పోతున్నారు. ఇంతలో ఓ పిల్ల 'అమ్మో' అంటూ చెత్త కుప్పలకాడి నుండి ఎగిరి దూకుతూ వచ్చి పడింది కంగారుగా.

'ఏందీ? ఏమైందీ? ఎందుకట్టా చెమటలు పోసుకుంటున్నా"!


ఆ పిల్ల తేరుకోలేదు. వొణికే కంఠంతో "అక్కడేదో కదులుతోంది'

'నీ మొహం! ఏం చూసి దడుసుకున్నావో! పద; చూద్దాం!" అంటూ ట్రాలీలు ఆపి, అటువైపు దారి తీశారు.

నిజంగానే పురిటిగుడ్డు. వొళ్లంతా రక్తం ఎండిపోయివుంది. చూస్తూనే అందరూ బిగుసుకు పోయారు. ఎక్కడివని అక్కడ వదిలేసి... పరిగెత్తుకుంటూ ఆఫీసుకు పోయి చెప్పారు. సూపర్‌వైజరు వచ్చి చూసి... సూళ్ళూరుపేట అంబులెన్స్‌కి ఫోన్ చేశాడు

ఇదంతా చూసి అక్కడ పని చేస్తున్నన్న వాళ్లలో ఓ ఉద్వేగం కమ్ముకుంది.

బిడ్డ బతికే వుంది. కానీ ఏడవడంలేదు. ఇంతలో అంబులెన్స్ రావడం పసిగుడ్డును తీసుకుని పోవడం చూస్తుండగానే జరిగి పోయింది.



ఇదంతా అన్ని జిల్లా పేపర్లలో కథలు కథలుగా రానే వచ్చింది. చుట్టుపక్కల గ్రామాలన్నీ అట్టుడికిపోయాయి; ' అచీపా' వచ్చాక ఆడవాళ్లలో వస్తున్న మార్పుల్ని జీర్ణించుకోవడమే కష్టంగా వున్న వాళ్ళకి ఇది మరింత దిగ్భ్రాంతిని కలిగించింది.

ఇటు కంపెనీలోనూ అలజడి రేగింది. ఎవరి పని! ఎట్లా జరిగింది! కంపెనీలో వాళ్ళ పనేనా? అంత గప్‌చిప్‌గా ఎలా చెయ్యగలిగారు.? జవాబుల్లేని ప్రశ్నలెన్నో

అనేకానేక సందేహాలమధ్య పెళ్ళయి పిల్లలున్న వాళ్ళ పనేనని నిర్ధారణ కొచ్చారు. అయితే పెళ్ళయి పిల్లలున్న వాళ్ళ శీల పరీక్షలు ఆరా తియ్యడం కంపెని పని కాదు.

ఇంత గందరగోళంలోనూ సునందకేదో అనుమానం మొలకెత్తింది.

డ్యూటీ బెల్ మోగగానే గబగబా పుష్ప సెక్షన్‌కు వెళ్ళింది. "కడుపులో నొప్పిగా వుందని మధ్యాహ్నం డ్యూటీ నుండి పర్మిషన్ పెట్టి వెళ్ళి పోయిందని" చెప్పారు? సెక్షన్‌లో వాళ్ళు. ఆమె అనుమానం మరింత బలపడింది.

సునందకు ఆ రోజు కూడా సప్లయి డ్యూటీనే, ట్రాలీ నెట్టుకుంటూ, అటూ ఇటూ తిరుగుతుంటే, మూడు నాలుగుసార్లు పుష్ప టాయిలెట్స్‌వైపు పోతూ కనబడింది. 'కడుపులో బాగా లేదా? అని పలకరించింది కూడా. కానీ పుష్ప అంటీ ముట్టనట్టు జవాబు చెప్పడంతో ! ఏంటీ? పలకరిస్తే సరిగా సమాధానం చెప్పదూ! అనికూడా అనుకుందామె అయితే పనిలో పడిపోయి ఆ మాటే మర్చిపోయింది.

కానీ సాయంత్రం ఈ గొడవతో ఆమె కేదో చటుక్కున తట్టినట్టయింది.

ఈ గొడవ అచీపా మేనేజ్ మెంటుకు తలనొప్పి కలిగించింది. ఆడామగా స్వేచ్ఛల మీద విదేశీ కంపెనీ వాతావరణం విదేశీ సంస్కృతిని తెచ్చిందనే వాదం చుట్టుపక్కల వ్యాపించింది.

దానితో కంపెనీ డాలా స్ట్రిక్టుగా వుందని వివరణ యిచ్చుకుంది. ఇది జరిగాక కంపెనీ నిజంగానే మనుషులమీద కాపలా పెట్టినంతపని చేసింది. సూపర్‌వైజర్లు పహారాలు కాశారు. అయినా మనుషుల మీద ఎన్నాళ్ళని కాపలా కాయగలరూ?

పుష్పమరణానికి ఆనాటి సంఘటనకు ఏదో లింకు తెలిసినట్టయ్యింది.

వీళ్ళు మాట్లాడుకుంటుండగానే. మరో ఇద్దరు ముగ్గురాడవాళ్ళు అక్కడికి చేరారు. వాళ్ళకు ఈ కంపెనీకి పోయేపిల్లల మీద గుర్రుగా వుంది.

వచ్చిన వాళ్ళను చూసి మాటలు ఆపేశారు.

విచారమో, నిరసనో తెలియని ఓ అసంబద్ధపు నిశ్శబ్దం ఆవరించిందక్కడ. ఎక్కడా పెద్దగా మాటలు జరగడం లేదు.

"మొగుడు పోయాక బాగానే వుంది ఇప్పుడే మొచ్చిందో" జనాంతికంగా అన్నది ఒకామె.

ఎవరూ ఏం మాట్లాడలేదు,

మరొకామె అందుకుంటూ! "భలే చెప్పావే! అప్పుడు పిల్లల్ని బతికిచ్చుటమెట్టానన్నదొక్కటే దిగులు, రేపటి కెట్టాగానని వెతుక్కోవడమేనాయె రూపాయి పుట్టే దెట్టా? అనే చూస్తిమి"

అప్పుడియ్యన్నీ వున్నయ్యా? జనం మారిపోలా ఇప్పుడు ఎవడి సుఖం వాడిదే ఈవిడకేం కష్టం వచ్చిందో? పిల్లల మంచీ, చెడూ కావాల్సి వచ్చిందా?

నెల తిరిగేసరికి మూడువేలు బిళ్లగుడుముల్లాగా చేతిలో పడుతుంటే! కంపెనీకి పోబట్టి పౌడర్లూ కాటుకలూ, ఎత్తుమడాల చెప్పులు మొగాళ్ళకు మల్లే డ్యూటీకి ప్యాంటూ, చొక్కా మెడలో బిళ్ళా! మరి మారుపురాలా!' అందుకే మొగాళ్ళుచేసే పనులల్లా చెయ్యాలనుకుంటున్నారు.

అచీపా పిల్లలకు లోపల్లోపల రగులుతోంది. ఓ పిల్ల నోరు తెరిచి ఏదో అనబోయేంతలో మరోపిల్ల లాగింది! వద్దని సైగ చేసింది.



**13-02-10** న కథానిలయంలో 'నాకు దేవుని చూడాలని లేదు' కథలు ఆవిష్కరిస్తున్న ప్రముఖ కథా రచయిత శ్రీ కాళీపట్నం రామారావు, కథా సంపుటి రచయిత శ్రీ కొండవలస శ్రీనివాసరావు, సమీక్షకులు శ్రీ చింతాడ తిరుమలరావు

ఇది కనిపెట్టి ఇంకొకామె మరింత ఎకసెక్కంగా! "అయ్యేనా! అదే అయితే అనుకునే దేందే! డ్యూటీలు లేనప్పుడు జంటలు జంటలుగా సూళ్ళూరుపేట పోయి సినిమాలు చూసి రావటంలా! అసలు పట్టుకునేటట్టున్నారా! ఆడా మగా!" అంది.

ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు.

మామూలప్పుడు అట్లా ఒక్కమాటంటే అచీపాలో పిల్లలు మీదబడి పోయేవారు ఇప్పుడు మాత్రం సమయం కాదని మౌనంగావిని మెల్లిగా అక్కడినుండి కదిలి పోయారు.

సునందకేమిటో గుబులుగావుంది. అసలు శేఖర్ నిలబడతాడా? వాళ్ళింట్లో ఒప్పుకుంటారో ? లేదో? తను తొందర పడి పోయిందా? ఏదో భయమూ, దిగులూ ఆవహించగా ఆ రోజంతా ముభావంగానే వుంది.

మర్నాడు తన భయాలన్నీ కమల దగ్గర కుప్పపోసిందామె.

"పుష్ప సంగతి వేరు సునందా! తనకు తోడు కావాలంటే తన వాళ్ళనే వెదుక్కోవాలిగానీ పెళ్ళికాని వాడికి దగ్గరయితే ఏం లాభం వాడు పెళ్ళి చేసుకోకుండా వుండిపోతాడా!"

"మీ దట్టా కాదుగా! వేరే వేరే కులాలనేగా మీ అనుమానం! అయితేనేం మన కంపెనీలోనే ఎంతమంది కులాంతర పెళ్ళిళ్ళు చేసుకున్నారో! చూస్తూ వుంటివిగదా!' రోజులు వెనకటి లాగానే వుండి పోతయ్యా"

పెద్దవాళ్ళు వద్దనే అంటారు అయితే మీరేం చిన్నపిల్లలా? సంపాదన లేనివాళ్ళా? అనవసరంగా కంగారు పడకు" ధైర్యం చెప్పింది కమల.

పుష్పమరణపు నీడలనుండి సునందేకాదు, మాంబట్టు పల్లె కూడా తేరుకుంది. ఆమె మరణం కాలపు మరపు పొరల్లో వొరిగి పోయింది.

\+ + +

సునందను వివరాలడిగాక! కమలనూ ఆమెను ఇద్దర్నీ కలిపి గట్టిగా చీవాట్లు పెట్టింది వినోదిని.

ఆడపిల్లలు కదా! జీవితమంటే అంత నిర్లక్ష్యం ఏమిటీ? అయినా ఈ 'అచీపా' వచ్చాక ఆడపిల్లలు ఎంతగా చెడిపోతున్నారో ! ఛీ...ఛీ...!

'పేషంట్లను అలా కోప్పడితే ఎలా? అనుకుంది అపర్ణ అక్కడ

పనిచేస్తున్న వాళ్ళకు మాత్రం డాక్టరమ్మ ఎందుకంట్లా విసుక్కుంటున్నారో; తెలుసు.

అపర్ణమొహం చూసి తనను తాను కంట్రోల్ చేసుకుంటు "ఎందుకిట్లా కోప్పడుతున్నానో ననిపిస్తుందిగదూ!" అంది.

అపర్ణ ఏం మాట్లాడలేదు.

"నిజమే! వచ్చిన వాళ్ళను ఇలా కసురుకుంటే మనదగ్గరకు ఎవరు వస్తారూ మనకు ప్రాక్టీసు ఎలా పెరుగుతుందీ?" కానీ అపర్ణా ఇట్లాంటి కేసులు వచ్చినప్పుడల్లా నేనెంత స్ట్రగుల్ పడుతున్నానో! చెప్పలేను" ఈ అబీపా వచ్చాక నేనెన్ని గర్భస్రావాలు చేశానో! ప్రతిసారీ నేనెంత యాతన పడుతున్నానో! తెలిస్తే! నువ్వింత ఆశ్చర్యపోవు"

ఓ క్షణం తనను తాను కంట్రోలు చేసుకుంటూ! ప్రతిసారీ ఇలా చెయ్యనని వెళ్ళి పొమ్మని చెప్పాలనిపిస్తుంది నేను చాలా సార్లు ఈ కడుపులు తియ్యలేక వెళ్ళిపొమ్మనే అంటున్నా! కానీ నేనలా అన్నప్పుడు! నారివెంట వచ్చే వాళ్ళ తల్లుల కళ్ళల్లో నీళ్ళు నన్ను నిలవనీయడం లేదు అపర్ణా! నేనా పని చెయ్యక పోతే ఇంకోచోటకయినా పోయి చేయించుకుంటారు. అక్కడ మరో మోసం! అదో బాధ'

డాక్టరమ్మ గయ్యిన ఎందుకు అరిచిందో చప్పున చల్లారిపోయా అంత జాలిగా కెందుకు మాట్లాడుతుందో వాళ్ళిద్దరికీ అయోమయంగా వుంది.

నిజమేగాని మేడమ్! మనం ఈ స్థితినంతా మార్చగలమా! మనకు చేతనయినంత కీడు చేయకుండా వుండటమే మనం చేసే మంచికాదా?

(ఇంకా ఉంది)

## విజ్ఞప్తి

**రచయితలు తమ రచనతోపాటు హామీపత్రాన్ని విధిగా జతచేసి పంపవలెను. అట్లు జతచేయని రచనలు పత్రికలో ప్రచురణకు స్వీకరించబడవు.**

# ముక్కాణీలు

## దృశ్యం-1

దృశ్యంలో నా రూపం లేదు
వాళ్ళ జ్ఞాపకాల్లో కాసింత తడుతూ నేను
మంచు గదిలో నాశవం....

× × ×

నా శ్మశానం ఏడనో- నాకుముందే తెల్సు!
వాళ్ళంతా చితి ముందు
కాసేపాగి నిష్క్రమించారు
ఈ దళితుడికి నా నమస్కారం

× × ×

వాడు నన్ను బూడిద చేసి సంస్కరిస్తున్నాడు
ఇప్పుడు నాకు అనంత బాహువులు
ఆనందానంతర స్వప్నాలు
ఇప్పుడు నా శిరస్సుని మీ చేతుల్లో పెడ్తున్నాను

× × ×

తల దువ్వుతారు – జూలు విదిలిస్తారు – మీ యిష్టం

## ఏ దృశ్యం గురించి కాదు

ఏ దృశ్యంతోనూ నాకు సంబంధంలేదు
అనుక్షణం అవమానించబడటం ఓ సందర్భం
ఈ వయస్సుల్లో ఒంగొంగి నేను!

× × ×

తమాయించుకుంటున్నా! ఎవర్నీ బాధించలేను!
ఇదో గుమాస్తాబుద్ధినాది
అందులోంచి ఈ మధ్య కవిత్వంలోకి రావటంలేదు
రాత్రుళ్ళు రాసినా ఏడ్చినా

× × ×

ఉదయాన్నే చించేస్తున్నా
పుస్తకం వాసన తెల్సిన వాడ్ని
కవిత్వం నా మనోగంధం
ఈ పరిమళాలని దాచుకోటం నా వ్యసనం!

× × ×

ఈ మధ్య ఏ పుస్తకం ఓ స్త్రీలా ఎదురు రాలేదు!

## ఓ అవమాన దృశ్యం

ప్రతి దృశ్యం ఓ అసందర్భం
నన్ను ఎవరో చంపేసి పోతారు
గణాంకాలలో ఓ మైనస్సు అవుతాను!

× × ×

చావులేని వ్యవస్థకి ఓ నమస్కారం
ఈ దేశ పటం నాకు శవంలా కన్పిస్తోంది
జీవాన్ని నింపే కార్మికులు
వలస పక్షుల్లా అల్లాడ్తున్నారు

× × ×

ఈ అస్థిరత నాచేత కవిత్వం రాయించలేదు
కలం పట్టుకున్నప్పుడల్లా
కాలం నా నిజాయితిని ప్రశ్నిస్తోంది
నమస్కారం పెట్టి వెనక్కి పోతున్నాను

× × ×

కవిత్వ మరణంతో నాలో ఓ తాగుబోతు!
ఇతి ముక్కాణీహః

శ్రీరామకవచం సాగర్

# పుట్టుకురుపు

నల్లూరి రుక్మిణి

"అది నిజమేగాని! అన్యాయానికి గురై అజ్ఞానంతో మన దగ్గరకొచ్చిన ఆడపిల్లలు! అందునా ఎక్కువ భాగం!... ఇదిగో ఇట్లా పెళ్లికాకుండా! వీళ్ళలా చాలామంది మోసానికి గురైపోతున్నారు. వాళ్ళ అమాయకత్వం, అనాలోచనా చూస్తే బాధేస్తుంది అపర్ణా! జాలేస్తుంది."

"దానికంటే ముందు నిజంగా వాళ్ళు ఆ ప్రెగ్నెన్సీని వుంచుకోగలరా? వుంచుకునే శక్తి వుందా? దానికి కారణమైనవాడు బాధ్యత పడకపోతేనో? వుంచుకోవాల్సివస్తే ఈ చిన్నపిల్లలు, తల్లులయితే! అక్కడితో వీళ్ళ జీవితం ముగిసి పోవడమేగా!"...

వినోదిని చెప్తున్న విషయాలు కొత్తగా అనిపిస్తున్నాయి అపర్ణకు. అందరూ ఈమెలాగా ఆలోచిస్తారా? అట్లా అయితే ప్రాక్టీసు చెయ్యగలరా?...

సునంద కూడా ఆమెను కళ్ళప్పగించి చూస్తోంది. ఆ పిల్లకి కూడా ఆ మాటలు వింటుంటే ఆందోళనగా అన్పిస్తోంది. అప్పటిదాకా లేని భయమేదో స్పర్శలోకి రాసాగింది.

పదినిమిషాలు అలాగే వుండిపోయి "ఆ అమ్మాయిని పడుకోబెట్టు సిస్టర్" అంది.

"డేటు ఎప్పుడు! ఎన్నిరోజులు లేటయ్యింది! మీ అమ్మకు తెలుసా! మీరెంతమంది! ఆ పిల్లాడెవరు! చేసుకుంటాడా? ఒకేకులాలేనా!" ఇట్లాంటివే ఇంకాకొన్ని ప్రశ్నలు వేసింది.

చేతులు శుభ్రం చేసుకుని కుర్చీలో కూర్చుంటూ... "వాళ్ళింట్లో ఒప్పుకోలేదని అతను రేపు పెళ్ళి చేసుకోకపోతే ఏం చేస్తావూ?"

సునంద భయంగా చూసిందామె వైపు.

"ఆ పిల్లను చూస్తూ! భయపడిపోయినట్టుంది మేడమ్" అంది అపర్ణ ఇంగ్లీషులో. ఆ మాటకు చిన్నగా నవ్వి... ఓ నిట్టూర్పు విడిచి! "నిజమే ఇలా మాట్లాడితే బెదిరిపోతారు మరి!... కానీ ఆ టూర్‌కి వెళ్ళి వచ్చినప్పటినుండి... అక్కడ విషయాలు అర్థమయిన కొద్దీ... కడుపులో తెమిలినట్టుంటోంది అపర్ణా! ఈ పిల్లలు ఏ సంస్కృతి వైపు పరుగులు తీస్తున్నారు?... రేపు ఈ పరిశ్రమలు మరిన్ని పెరిగాక ఇంకా ఏం మార్పులు వస్తాయోననే భయం"

అపర్ణ కూడా ఈ ఏడెనిమిది నెలలుగా వినోదినిని అర్థం చేసుకుంటూ ప్రపంచాన్ని గురించి తెలుసుకుంటోంది.

"అక్కడ వేరు అపర్ణా! ఆ దేశాల్లో అదే జీవనం. దానికనుగుణంగా వాళ్ళ కల్చర్ మారింది. మనలాంటి సోషల్ స్టిగ్మా లేదక్కడ... నిజం నువ్వు నమ్మవుగానీ అక్కడ బహిరంగంగా 'బ్రా'లతో, 'పాంటీ'లతో ఆడవాళ్ళు తిరగడం నేను చూశాను. 'థాయ్‌లాండ్'లో 'పటోలా' అనే చోట నగ్నంగా డాన్సులు చెయ్యడమే కాదు... ఇంకా డబ్బులు వెదజల్లగలిగితే... అట్టా లైవ్ చూపించినట్టు 'సెక్సువల్ ఇంటర్ కోర్సు' చూపిస్తారంట బహిరంగంగా. భార్యకు విటుల్ని తేవడం తప్పు లేదనుకుంటున్నారంటే ఏమిటో చెప్పు మరి."

"తప్పు అనుకుంటున్నారా! లేదా! అనేది కాదు మేడమ్! అట్టాంటి స్థితి ఆ సమాజానికి వచ్చినందుకు మానవజాతి సిగ్గుపడాలి!... ఆడవాళ్ళ శరీరాలు అమ్మకపు సరుకవడం ఎంత నీచ సంస్కృతి."

"నా విచారమదే అపర్ణా! మనకు చదువుల్లేవు. అజ్ఞానం.. ఇంకా ఈ పిల్లల్లో అమాయకత్వం పోలేదు. ఇదిగో ఇట్లా కొత్తకొత్త కంపెనీలు రావడంతో డబ్బులు కనిపిస్తాయి... దానికితోడు టీవీల ప్రభావం. రేపు ఆ కొత్త కంపెనీలల్లో కూడా ఈ వయసు ఆడపిల్లలే ఎక్కువగా వుంటారు. వీళ్ళంతా జరుగుబాటులేక ఏ పల్లెటూళ్ళ నుండో ఏ వాడల నుండో వస్తారు."

"నిజమేలే మేడమ్! అసలు ఇప్పుడు కొంతమందిని చూస్తుంటేనే ఆశ్చర్యంగా వుంటోంది! వాళ్ళ ఫ్యాషన్స్... విచ్చలవిడిగా డబ్బుఖర్చు చెయ్యడం..."

"అందుకే అపర్ణా! ఈ అభివృద్ధిని గురించి

నేను సంశయపడేది. ఇది ఎటు దారితీస్తుందోనని... నువ్వు వింటే ఆశ్చర్యపోతావు! మనకు ఏనాటిది ఈ దేవదాసీ వృత్తి. ఇప్పుడు వృత్తిగానయితే పోయింది గదా!... కానీ ఆ కౌలాలంపూర్, థాయ్‌లాండ్ లాంటి చోట! ఇదొక వృత్తికింద తల్లులు తమ పిల్లలకు చిన్నప్పటి నుండీ ట్రైనింగ్ ఇస్తారంట!... ఆ పిల్లే చెప్పింది."

"ఈ 'రైనా' కు ఓ పదహారేళ్ళ చెల్లెలుందట. వాళ్ళమ్మ ఆ పిల్ల పేరూ, రూపురేఖలూ, ఎత్తు, కొలతలు వివరంగా వర్ణిస్తూ వెబ్‌సైట్‌లో పెట్టిందంట. ఎవరైనా మంచి ధర ఆఫర్ చేస్తారని!... 'ఇరవై ఐదు వేల దాలర్లు' వస్తాయని ఆశగా వుందంట వాళ్ళ అమ్మకు".

మాకు ఆశ్చర్యం వేసి! అడిగితే! ఆ పిల్ల చెప్పింది విని ఆశ్చర్యపోవడం మా వంతయింది.

"ఇలాంటి పిల్లల కోసం అమెరికా, ఆస్ట్రేలియాల నుండి ఎగబడి వస్తారట అపర్ణా!... మనం ఈ కన్నెరికపు ఆచారం గురించి ఏవగించుకుంటున్నాం... కానీ అక్కడ 'డిప్లవరింగ్' అని నాజూకు పేరు పెట్టి స్త్రీలను బహిరంగంగా వేలం వేస్తున్నారు. పైగా ఎంత క్రేజంటే తీనికోసం వేలంతో పాట పెట్టినట్టు పోటా పోటీలు".. చెప్తూ చెప్తూ వినోదినిని పట్టేసినట్టుగా ఆగిపోయింది. ఆమెకు మనసు వికలమయింది.

"అబ్బా! ఇంక వద్దు మేడమ్! వినడానికే సిగ్గుగా వుంది"... అపర్ణకు కడుపులో దేవినట్టయి మౌనంగా వుండిపోయింది.

చాలాసేపు ఎవరూ మాట్లాడలేనట్లయి పోయారు.

ఎప్పటికో సునందనుద్దేశిస్తూ.. "ఇదిగో ఈ మందులు మూడు రోజులు వాడు... ఈసారి వచ్చేటప్పుడు మీ పెద్దవాళ్ళను తీసుకురా!" అంది.

సునందకు హాస్పిటల్‌కి వచ్చినప్పుడున్న ధైర్యం వెళ్ళేటప్పుడు లేకపోయింది.

ఆ పిల్లలు వెళ్ళినవైపే చూస్తూ!... "మనం ఏమీ చెయ్యలేమా? మేడమ్! ఇదంతా చూస్తూ వూరుకుండి పోవడమేనా?"... దిగులుగా వుంది అపర్ణకు. ఆమె ఇంకా జీవితంలోకి అడుగుపెట్టదు. ఏదో ఆదర్శం కెలుకుతోంది మనసులో.

"ఇదిగో ఇట్లా ఈ నీచపుపని... ఒకచోట కాదు అపర్ణా! అంతర్జాతీయంగా అల్లుకుపోయింది. జీవితానికి తిండీ, సెక్సే ప్రధానమన్నట్టు చేసి పెట్టారు. మనిషికి మరో ఆలోచన రాకుండా ఆడదాని శరీరాల చుట్టూ వెంపర్లాడిస్తూ తిప్పడమే, దీనిలో వున్న దుర్మార్గం. యుద్ధాలతో విసిగిపోయిన సైనికులకు పాశ్చాత్య దేశాలవాళ్ళు ఇచ్చే రాయితీ ఏమిటో తెలుసా?... ఇదిగో ఈ దేశాలకు టూరిస్టుపాస్‌లు, ప్యాకేజీ టూర్లు!... ఇది ఇప్పటిది కాదు. వియత్నాం యుద్ధ దురంతాల కాలం నుండి సాగుతోంది.

"నువ్వూ, నేనే కాదు ఈ చట్రం ఇట్లా వున్నంతకాలం ఎవరూ ఏమి చెయ్యలేరు. ఇదో పుట్టుకురుపు.. దీన్ని మార్చడం ఎవరివల్లా కాదు. మార్చాలనుకున్నా మారనివ్వదీ ప్రపంచం"... వినోదిని స్వరంలో చెప్పలేని బాధ సుడి తిరుగుతోంది.

ఓ క్షణం వూపిరి తీసుకుంటూ... "ఇంతెందుకు అపర్ణా! థాయ్‌లాండ్ లాంటి చోట ఈ ఆడపిల్లల్ని వాడుకునేదెవరో తెలుసా! అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ వంటి సోకాల్డ్ నాగరికత బలిసిన వాళ్ళే... ఆ దేశాల్లో రిటైరయ్యాక ఓల్డ్ ఏజ్ హోమ్స్‌కి పోతారు మామూలుగా... ఎందుకంటే వాళ్ళకి వచ్చేది బయట బతకటానికి చాలదు. ఆ వెధవలు ఇక్కడికి వచ్చి డాలర్లను ఇక్కడి కరెన్సీలోకి కన్వర్ట్ చేసుకుని... అవి చూపి ఈ చిన్న పిల్లలతో!... అటు సెక్సూ, ఇటు ఇంటి చాకిరీ చేయించుకుంటారు దర్జాగా ఫోజులు కొడుతూ! దొంగ వెధవలు. వాళ్ళ దేశాల్లో ఇట్లాంటి చెత్తగాళ్ళను పట్టించుకునే దిక్కుండదుగా! అక్కడైతే కుక్కచావు చస్తారు"... కసితో ఆమె గొంతు తీక్షణమైంది.

తన ఆవేశాన్ని తానే సంబాళించుకోవడం కోసమన్నట్టుగా, ఓ క్షణం ఆగి... "ఇంత క్రితం నువ్వన్నావే 'మనమేం చెయ్యలేమాని'"!... ఎట్టా? ఏం చెయ్యగలం?.. ఈ దేశాలన్నీ ఇట్లా నాశనం కావడానికి!... అభివృద్ధి పేరుతో ఈ సంస్కృతిని ఎవరు పెంపొందిస్తున్నారో! ఈ దేశాల్లోని సహజ సంపదలను ఎవరు కొల్లగొడుతున్నారో? వీళ్ళంతా మనలాంటి వాళ్ళు ఏదైనా చెయ్యబోతే వూరుకుంటారా?... అపర్ణా! వట్టిమాట! ఒక్కనాటికీ వూరుకోరు".

దీర్ఘంగా నిట్టూర్చి మౌనంగా వుండిపోయింది వినోదిని.

సంభాషణ ఆగిపోయింది.

అప్పటికి పొద్దుపోయింది. చీకటి పడిందని అపర్ణ కూడా వెళ్ళిపోదామనుకుంటూ. "అది సరే మేడమ్! ఇన్ని విషయాలు ఆ పిల్ల మీకెట్లా చెప్పగలిగిందీ?. ఆ 'రైనా' కూడా ఏదో ఒక సిస్టమ్‌లోనే వుండివుంటుంది గదా!"... అనుమానంగా అంది.

నిజానికి మనం ఇట్లా ఏదన్నా ఇంటర్వ్యూలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నామంటేనే ఎక్కడికక్కడ 'చెక్' పెట్టేస్తారు! అట్లాంటి ముఠాలు.

యాదృచ్ఛికంగా తమాషా జరిగి మాకీపిల్ల కలిసింది... మా టూర్‌లో మొగవాళ్ళు కొంతమంది వచ్చారని చెప్పానుగా!... ఒకరిద్దరు ఫ్యామిలీస్‌తో రాలేదు. అది గమనించి హోటల్‌కి సంబంధించిన వాళ్ళెవరో వచ్చి "యూ వాంట్ ఫిలానర్సర్" అని అడిగారంట.

"అంటే! ఏమిటని" వీళ్ళు వివరం అడిగితే!

"జస్ట్ ఫర్ ఫన్" అన్నారంట.

ఆ మాటకు వీళ్ళకు ఆసక్తి కలిగి "సరే" పంపమన్నారంట. అట్లా ఈ పిల్ల వాళ్ళ రూమ్‌కి వచ్చింది.

పిల్ల మంచి రంగు, ఇరవైఏళ్ళే, పైగా ఆ దేశంవాళ్ళు చూడముచ్చటగా వుంటారుగా!... అందులో ఓ డాక్టరు కాస్త బులపాటం మనిషిలే... ఇంకేం వువ్విళ్ళూరిపోయాడు.

"పైగా ఈ పిల్ల చక్కగా కబుర్లు చెప్పగలదు. వాళ్ళదేశపు వివరాలు చెప్పిందట. మనదేశపు విశేషాలు అడిగిందట" అంతా అయ్యాక... "అదిరిపడి" అని పర్సులోనుంచి కండోమ్ తీసిందట. దానితో మనాడు అదిరిపడి మంచం మీద నుండి అంతెత్తు ఎగిరి... పరిగెత్తుకుంటూ మా రూమ్‌లోకి వచ్చిపడ్డాడు.

వినోదిని చెప్పే తీరుచూసి అపర్ణకు నవ్వాగలేదు. ఇద్దరూ కలిసి నవ్వుకుంటే



పెద్దాపురంలో "ఆడు మగాడు" పుస్తకావిష్కరణ సభలో పుస్తక రచయిత శ్రీ యాసలపు సూర్యారావు, పుస్తక ఆవిష్కర్త, శ్రీమతి ముప్పన్న శ్యామలాంబ, సభాధ్యక్షులు బి. అనంతరావు, ముఖ్యఅతిథి శ్రీ అద్దేపల్లి రామ్మోహనరావు, కవి శ్రీ జ్యోష్యుల కృష్ణబాబు, శ్రీ గద్దే పచ్చాలరావు తదితరులు.

అక్కడున్న ఆయమ్మలకు అర్థం కాలేదు. అయినా వాళ్ళూ నవ్వుమొహాలు పెట్టుకున్నారు.

నవ్వు ఆపి... ఓ ఐదు నిమిషాలు స్థిమితపడి... "దాంతో మాకూ ఆసక్తిగా అనిపించి... నేనూ, మా ఫ్రెండ్ ఆ రూమ్‌కి వెళ్ళాం... అక్కడ ఈ 'రైనా' మాకు కలిసింది.

"ఏమో మేడమ్! వాళ్ళ వ్యాపారాల కోసం ఈ సెజ్‌లు... సెజ్‌ల కోసం మన భూమి, మన జనం మన ముడిసరుకులు... అంతా మనవే! కానీ లాభాలు వాళ్ళవి. దీనికితోడు మన దగ్గర మనతో చేసే వ్యాపారంలో వచ్చిన మిగులు డబ్బుతో మన ఆడపిల్లల్నే కొని... ఎంజాయ్ చెయ్యడం ఏ దేశంలోనైనా ఇదే చరిత్రలాగుంది వాళ్ళది"...

"అబ్బా! వాళ్ళని కాదు మేడమ్! ఇక్కడున్న ఈ నాయకులను అనాలీ?"...ఆవేశంగా అంది అపర్ణ.

వినోదిని అపర్ణను చూస్తూ ఆత్మీయంగా భుజం తట్టింది.

× × ×

నాలుగైదు రోజుల అవతల ఓ ఆదివారం సునందతో పాటు శేఖరూ.. కమలా, భాస్కర్‌లు కూడా వచ్చారు.

సునందను చూస్తానే "వీళ్ళద్దరిలో నీ ఫ్రెండ్ ఎవరు" అని అడిగింది వినోదిని.

శేఖర్ వైపు చూసింది... వినోదిని కూడా అతన్ని చూస్తూ... "ఏం? పెళ్ళి చేసకుంటున్నావా? లేదా?" అంది.

"ఎందుకు చేసుకోను డాక్టరుగారూ! నేనలాంటి వాడిని కాదు. కాకపోతే మావాళ్ళను ఎలాగన్నా ఒప్పిద్దామని అంతే!"

"అయితే ఇంకేం మరి... చేసేసుకోండి... ఇక ఎబార్షన్ ఎందుకూ? పెద్దవాళ్ళను ఒప్పించాలనుకున్నవాళ్ళు! తొందరపడి పోకుండా వుంటే బావుండేది!.. ఇప్పుడిక మీ చేతిలో లేదు గదా!"

కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు.

శేఖరే ధైర్యంచేసి... "అదికాదు డాక్టరుగారూ... అసలు చెప్పకుండా చేసుకుంటే... ఎప్పటికీ కలవలేంగదండీ... పెద్దవాళ్ళకు చెప్పి... వాళ్ళకు కొంత టైమిద్దామని... నా తప్పులేకుండా?"

"అంటే ఈ పేరుతో తప్పుకుందామనా?... అదంతా వీలుకాదు నా దాకా వచ్చింది గదా! నువ్వు చేసుకోనంటే నేనే కంప్లైంట్ ఇప్పిస్తా!" అంది బెదిరింపుగా.

వినోదిని మాటలకు చిన్నబుచ్చుకున్నాడు శేఖర్.

మిగిలినవాళ్ళు మొహాలు అదోలా అయ్యాయి.

'ఈ పిల్లాడు మంచివాడులాగానే వున్నాడనిపించిందామెకు. లేకపోతే ఇక్కడిదాకా వచ్చేవాడే కాదు' అని కూడా అనుకుంది.

అట్లా ఆలోచన రాగా... "అయితే ఓ పని చెయ్యండి. ఈ పిల్ల తల్లిదండ్రుల్ని పిలుచుకురండి. వాళ్ళ నమక్షంలో ఏ గుళ్ళోనో దండలు మార్చేసుకోండి... ఆ సంగతి బయటకు రాకుండా చూసుకుని... అప్పుడు మీ పెద్దవాళ్ళకు చెప్పు."

"గుళ్ళో తంతు అయిపోయాక... నాదగ్గరకు తీసుకురా. మీకు ఇబ్బంది లేకుండా చేస్తా!" అంది.

డాక్టరమ్మ పెట్టిన లింకు కాసేపటికి గాని అందరికీ అర్థం కాలేదు.

"సరేనండి! మేం ముందు సునంద వాళ్ళ అమ్మానాన్నలకు చెప్పి రెండు మూడు రోజుల్లో మీదగ్గరకు తీసుకుని వస్తాం!" ధైర్యంగా చెప్పి వెళ్ళిపోయారు. ఆ పిల్లలు వెళ్ళిపోతూ వుండగా వాళ్లనే చూస్తూ వున్న అపర్ణతో... "మార్పు తప్పదు అపర్ణా! పాతరోజుల మీద మనకు ఎంత ప్రేమవున్నా... అది గతమే అవుతుంది. భవిష్యత్తుని నిర్మించుకోవాల్సింది జనమే. ఈ ఉద్యోగాలే లేకుండా వుంటే! వీళ్ళింత ధైర్యంగా కులాంతరం చేసుకోవడానికి సిద్ధపడే వారా?... సునంద ధైర్యంగా వుండటం గమనించి వినోదిని అన్నది. (సమాప్తం)

## ఉత్తమ రచనలకు రమ్య సాహితీ అవార్డులు

రమ్య సాహితీ సమితి ఉత్తమ కవితా సంపుటికి, ఉత్తమ కథా సంపుటికి, ఉత్తమ కథా సంకలనానికి రెండేసి వేల రూపాయల చొప్పున అవార్డులివ్వనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి తెలిపారు. 2009, 2010 సంవత్సరములలో ప్రచురితమైన రచనలే పోటీలకు అర్హమైనవి. ఆసక్తి కల కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు తమ ముద్రిత రచనలు 3 కాపీలను మే పదిహేనవ తేదీ 2010లోగా ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి, అధ్యక్షుడు, రమ్య సాహితీ సమితి, 14-73/6, జె.వి.ఎల్.రావు నగర్, పెనుగొండ-534320, పశ్చిమగోదావరి జిల్లా. సెల్‌నెంబరు. 9848663735"

## "జీవిత చరిత్ర" రచనలకు సాహితీ పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకులు, డా॥ ద్వానాశాస్త్రి 63వ జన్మదినోత్సం సందర్భంగా సాహిత్య సాంస్కృతిక రంగాలలో గత ఐదేళ్ళలో వెలువడిన జీవిత చరిత్రలలో ఉత్తమమైన రచనకు 5,000/-రూపాయలతో ద్వానా శాస్త్రి పురస్కారం జూన్ 15వ తేది శ్రీ త్యాగరాయ గాన సభలో బహుకరించబడుతుంది. రచనలు మే 15వ తేదీలోపు ఈ క్రింది చిరునామాకు పంపవలెను. శ్రీమతి డి. దుర్గ, 1-1-428, గాంధీనగర్, హైదరాబాద్-500 080

## పంజాబ్‌లోకి 'జిగిరి' నవల

పెద్దింటి అశోక్‌కుమార్ నవల 'జిగిరి' పంజాబ్‌లోకి అనువదించబడి 'కహానీ పంజాబ్' పత్రికలో అచ్చయింది. 2009 సంవత్సరంలో ఈ నవలను డా॥ జె.ఎల్. రెడ్డి హిందీలోకి అనువదించగా హిందీ నుంచి డా॥ క్రాంతిపాల్ ఆంకే పంజాబీలోకి అనువదించారు. త్వరలో ఈ నవల బెంగాలీ, ఒరియా భాషల్లో రాబోతుంది.